

స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో జరగకపోతే 16వ ఆర్థిక సంఘం ద్వారా రావాల్సిన రూ.12,500 కోట్ల నిధులు కోల్పోయే ప్రమాదం ఉంది. అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు, దాడులకు పాల్పడుతూ సుప్రీంకోర్టు తీర్పుపై తప్పుడు ప్రచారం చేస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 24.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 183 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## ముగిసిన పరిషత్ నామినేషన్ల పర్వం




- 25న పరిశీలన.. తుది జాబితా ప్రకటన
- 659 జడ్పీటీసీ, 9,829 ఎంపీటీసీ స్థానాలకు నామపత్రాల దాఖలు పూర్తి
- చివరిరోజు ప్రధాన పార్టీల సందడి.. పలుచోట్ల ఉద్రిక్తతలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** పరిషత్ ఎన్నికల సమరంలో తొలి ఘట్టం ముగిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల కోసం నామినేషన్ల దాఖలు ప్రక్రియకు తెరపడింది. చివరిరోజైన శుక్రవారం ప్రధాన పార్టీల అభ్యర్థులు ర్యాలీలు, అనుచరుల సందడి మధ్య నామపత్రాలు సమర్పించారు. పలుచోట్ల పోటాపోటీగా నామినేషన్లు దాఖలు కాగా.. మరికొన్ని ప్రాంతాల్లో పోలీసుల ఆంక్షలు, అభ్యర్థుల అనుచరుల నిరసనలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి పరిశీలన, తుది అభ్యర్థుల జాబితాపై పడింది.

**25న కీలక ఘట్టం :** రాష్ట్రవ్యాప్తంగా 659 జడ్పీటీసీ, 9,829 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల దాఖలుకు నిర్ణీత గడువు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఈ నెల 25న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అర్హులైన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. చివరి రోజు కావడంతో నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**చీరాల, పర్చూరులో సందడి :** బాపట్ల జిల్లా చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో నామినేషన్ల చివరి రోజు సందడి నెలకొంది. చీరాలలో తెదేపా, వైకాపా అభ్యర్థులు అనుచరులతో ర్యాలీలుగా వచ్చి ఎంపీటీసీ స్థానాలకు నామపత్రాలు సమర్పించారు. నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు మద్దతుగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి నామినేషన్ కేంద్రం వద్దకు వచ్చారు.

**శ్రీరామ్ నామినేషన్ :** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు మండలం నుంచి కూటమి జడ్పీటీసీ అభ్యర్థిగా పరిటాల శ్రీరామ్ నామినేషన్ వేశారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే, జిల్లా తెదేపా అధ్యక్షుడు ఎం.ఎస్. రాజు ఆయన వెంట నామినేషన్ కేంద్రానికి వెళ్లారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. కౌతాళంలో కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. మిగతా 2లో...

## యువశక్తితో బలమైన భారత్



### చిన్మయ సమ్మేళనంలో ప్రధాని మోదీ ఉద్ఘాటన

### యువతే దేశాభివృద్ధికి కేంద్రబిందువు

### చిన్మయ మిషన్ 75 ఏళ్ల ఉత్సవాల ముగింపు వేడుకలు

**న్యూఢిల్లీ:** యువతలోని సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకుంటేనే బలమైన, అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించగలమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారి శక్తిసామర్థ్యాలకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారా జాతి పురోగతిని వేగవంతం చేయవచ్చని ఉద్ఘాటించారు. ఆధ్యాత్మిక విలువలు, భారతీయ సంస్కృతి, యువత భాగస్వామ్యం దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన 'చిన్మయ అమృత మహోత్సవ గ్లోబల్ సమ్మేళన్'ను ఆయన ప్రారంభించారు.

**స్వామి చిన్మయానందతో భేటీ గుర్తు :** ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు స్వామి చిన్మయానందతో 1993లో జరిగిన తన చివరి సమావేశాన్ని మోదీ గుర్తు చేసుకున్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర, యువశక్తిని ఎలా పెంపొందించాలనే అంశాలపై అప్పట్లో ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు. ఆ సమావేశం జరిగిన కొన్నేళ్లకే ప్రజలు తనకు గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించారని పేర్కొన్నారు. అప్పటి నుంచి తన విధానాలు, కార్యక్రమాల్లో యువతే కేంద్రబిందువుగా ఉన్నారని వివరించారు.

**చిన్మయ మిషన్ ఓ ఆధ్యాత్మిక తత్వం :** చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, భారతీయ సనాతన ఆధ్యాత్మిక తత్వానికి ప్రతిరూపమని ప్రధాని అభివర్ణించారు. మిగతా 2లో...

## కూటమిలో సీట్ల సర్దుబాటుపై కసరత్తు

- చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ ప్రత్యేక భేటీలు
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల పంపకాలపై చర్చలు.. రెబల్స్ బెడదపై నేతల దృష్టి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల పంపకాలపై కూటమి నేతలు కసరత్తు ముమ్మరం చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో జనసేన, బీజేపీకి ఎన్ని సీట్లు కేటాయించాలన్న అంశంపై సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రత్యేకంగా చర్చించారు. ఒకవైపు మిత్రపక్షాల డిమాండ్లు.. మరోవైపు ఆశావహుల ఒత్తిళ్లు, రెబల్ అభ్యర్థుల బెడదతో సీట్ల సర్దుబాటు కీలకంగా మారింది. మిగతా 2లో...



## అమితాబ్ బచ్చన్ బంగ్లాను పేల్చేస్తామంటూ బెదిరింపు

- పాఠశాలకు వచ్చిన ఈ-మెయిల్‌తో కలకలం
- అప్రమత్తమైన ముంబయి పోలీసులు.. ప్రారంభమైన దర్యాప్తు

**ముంబయి(జర్నలిస్ట్ ఫైల్):** బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్ బచ్చన్ బంగ్లాను పేల్చేస్తామంటూ వచ్చిన బెదిరింపు ఈ-మెయిల్ ముంబయిలో కలకలం రేపింది. నగరంలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ ప్రాంతంలో ఉన్న ఓ పాఠశాలకు శుక్రవారం ఈ సందేశం వచ్చినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. బెదిరింపు వెనుక ఎవరున్నారు? అమితాబ్ బచ్చన్‌కు చెందిన ఏ బంగ్లాను లక్ష్యంగా చేసుకున్నారు? మిగతా 2లో...

## పోలీసుల సంయమనాన్ని బలహీనతగా భావించొద్దు

- ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు
- రాజకీయ పలుకుబడి ఉన్నా ఉపేక్షించేది లేదు
- 14 ఘటనలు.. 17 మంది నిందితుల గుర్తింపు: డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా స్పష్టం చేశారు. రాజకీయ పలుకుబడి, పదవులు, జనసమీకరణ బలం ఉన్నాయని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించబోమని హెచ్చరించారు. అభ్యర్థులు నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు, ఓటర్లు స్వేచ్ఛగా తమ హక్కును వినియోగించుకునేందుకు పోలీసు శాఖ పూర్తి రక్షణ కల్పిస్తుందని తెలిపారు. పోలీసుల సంయమనాన్ని బలహీనతగా భావించవద్దని, హింసకు పాల్పడినా.. తెరవెనుక ఉండి ప్రేరేపించినా కఠినంగా వ్యవహరిస్తామని తేల్చిచెప్పారు.

**8 జిల్లాల్లో 14 ఘటనలు :** రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ అత్యధిక ప్రాంతాల్లో ప్రశాంతంగా సాగినప్పటికీ.. ఎనిమిది జిల్లాల్లో 14 ఎన్నికల సంబంధిత అవాంఛనీయ ఘటనలు నమోదైనట్లు డీజీపీ వెల్లడించారు. పల్నాడు, కడప జిల్లాల్లో మూడేసి ఘర్షణలు చోటుచేసుకున్నాయని తెలిపారు. అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో రెండేసి, తిరుపతి, కర్నూలు, అన్నమయ్య, మార్కాపురం జిల్లాల్లో మిగతా 2లో...

## చైనా సరిహద్దులో ఇంకా ప్రతిష్టంభన



- అరుణాచల్ వద్ద ఘర్షణలు కొనసాగుతున్నాయి
- ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్ వెల్లడి
- గల్వాన్ తరహా పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణ

**న్యూఢిల్లీ:** భారత్-చైనా సరిహద్దులో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నాయా? అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయన్న ప్రకటన ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ ఈ పరిణామాలను ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న శౌర్య కమాండోలు అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నారని ఆయన ప్రశంసించారు. మరోవైపు, జాతీయ భద్రతపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మిగతా 2లో...

## చైనాలో భూకంప బీభత్సం



- 16 మంది మృతి.. 76 మందికి గాయాలు
- 12 వేల మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- సహాయక చర్యల్లో 5 వేల మందికిపైగా సిబ్బంది

## పారా క్రీడల్లో భారత్ రికార్డుల జోరు

- మూడు ప్రపంచ రికార్డులు.. పతకాల సెంచరీ దాటిన భారత్
- 114 పతకాలతో సరికొత్త చరిత్ర
- నేటితో ముగియనున్న ఆసియా పారా క్రీడలు

**నగోయా:** పతకాల వేటలో భారత పారా అథ్లెట్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆసియా పారా క్రీడల్లో ఒకే రోజు మూడు ప్రపంచ రికార్డులు నమోదు చేస్తూ దేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటారు. ట్రాక్‌పై వేగంతో.. మైదానంలో జావెలిన్ విసురుతో.. షూటింగ్‌లో గురి తప్పని లక్ష్యంతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టారు. ఈ ప్రదర్శనతో భారత్ పతకాల సంఖ్య 114కు చేరింది. గత



ఆసియా పారా క్రీడల్లో సాధించిన 108 పతకాల రికార్డును అధిగమించి భారత బృందం సరికొత్త మైలురాయిని అందుకుంది.

400 మీటర్ల పరుగులో స్వర్ణం : పురుషుల 400 మీటర్ల టీ-44 విభాగంలో మిగతా 2లో...

## రాష్ట్రానికి భారీ వర్ష సూచన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** తూర్పు మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతుంది. 24 గంటల్లో వాయుగుండంగా, ఎల్లుండికి తీవ్రవాయుగుండంగా మారి అనంతరం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో భీకర తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తుపాను మరింత బలపడి రెండ్రోజుల్లో ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాల వైపు దూసుకొస్తుందని అంచనా వేశారు.

తుపాను తీవ్రత దృష్ట్యా సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు తక్షణమే తీరానికి తిరిగి రావాలని, రానున్న 5 రోజుల పాటు ఎవరూ సముద్రంలోకి వెళ్లరాదని అత్యవసర హెచ్చరికలు జారీ చేశారు. తీరం వెంట గంటకు భారీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ప్రజలు, ముఖ్యంగా రైతులు తమ పంటల రక్షణ విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సహాయం, తుపాను సమాచారం కోసం రాష్ట్ర విపత్తుల



నిర్వహణ సంస్థలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ టోల్ ఫ్రీ 112, 1070, 18004250101 నంబర్లు సంప్రదించాలన్నారు.

రేపు కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా , గుంటూరు, బాపట్ల, ప్రకాశం, రాయలసీమ జిల్లాలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదివారం అల్లూరి, పోలవరం, కృష్ణా , గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, రాయలసీమ జిల్లాలో అక్కడక్కడ మిగతా 2లో...

## జడ్పీటీసీ అభ్యర్థిగా శ్రీరామ్ నామినేషన్



- సత్యసాయి జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ సమర్పణ
- నిరాడంబరంగా నామినేషన్ ప్రక్రియ పూర్తి

**కదిరి (జర్నలిస్ట్ ఫైల్):** రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరుస్తూ, తెలుగుదేశం పార్టీ నేత పరిటాల శ్రీరామ్ స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం నల్లచెరువు జడ్పీటీసీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేశారు. మిగతా 2లో...

# యువశక్తితో బలమైన భారత్



(మొదటి పేజీ తరువాయి)

భారతదేశానికి తన నాగరికతా మూలాలే ప్రత్యేక గుర్తింపునిస్తాయని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలను భావితరాలకు అందించడం అత్యంత ముఖ్యమని సూచించారు. స్వామి చిన్మయానంద ఆధ్యాత్మిక బోధనలు సమాజానికి అందించిన సేవలను ఈ సందర్భంగా ప్రస్తావించారు.

**40 వేల కిలోమీటర్ల యువజన యాత్ర** : చిన్మయ అమృత మహోత్సవంలో భాగంగా దేశవ్యాప్తంగా యువత చేపట్టిన కార్యక్రమాలను మోదీ ప్రశంసించారు. సుమారు 300 రోజులపాటు 40 వేల కిలోమీటర్లు ప్రయాణించి లక్షలాది మందిని కలుసుకున్న యువతీయువకుల బృందం సేవలను కొనియాడారు. భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వారు చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

**వేదాంత జ్ఞానాన్ని ప్రజల్లోకి..** : వేదాంతం, భగవద్గీతలోని జ్ఞానాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో స్వామి చిన్మయానంద 1951లో చిన్మయ మిషన్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి ఆధ్యాత్మిక బోధనలు, భారతీయ తాత్విక విలువలను విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మిషన్ 75 ఏళ్ల ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మేళన్ అక్టోబర్ 25 వరకు కొనసాగనుంది.

**సంస్కృతి.. యువత.. దేశ నిర్మాణం** : భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని యువతకు చేరువ చేయడంతోపాటు దేశాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై ఈ సమ్మేళనం దృష్టి సారించింది. యువశక్తికి ఆధ్యాత్మిక విలువలు తోడైతే దేశ నిర్మాణానికి మరింత బలమైన పునాది ఏర్పడుతుందనే సందేశం ఈ కార్యక్రమంలో ప్రధానంగా వినిపించింది.

# ముగిసిన పరిషత్ నామినేషన్ల పర్వం




(మొదటి పేజీ తరువాయి)

**పోలీసు బందోబస్తు మధ్య నామపత్రాలు** : కడప జిల్లా మైదుకూరులో వైకాపా అభ్యర్థులు పోలీసు రక్షణ మధ్య ప్రత్యేక వాహనాల్లో నామినేషన్ కేంద్రానికి చేరుకుని పత్రాలు సమర్పించారు. మరోవైపు వేంపల్లిలో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న వైకాపా శ్రేణులను విడాలమిట్ట కాలేజీ రోడ్డు వద్ద పోలీసులు అడ్డుకోవడంతో వారు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

**యర్రగొండపాలెంలో ఆందోళన** : మార్కాపురం జిల్లా యర్రగొండపాలెంలో నామినేషన్ దాఖలుకు వెళ్లనీయడం లేదంటూ వైకాపా శ్రేణులు ఆందోళనకు దిగాయి. రహదారిపై బైఠాయించాయి. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితోపాటు మరో ఇద్దరికే అనుమతి ఉంటుందని పోలీసులు వివరించారు. అనంతరం అభ్యర్థులను క్యూ పద్ధతిలో ఒక్కొక్కరిగా లోపలికి పంపించారు.

**ఉత్తరాంధ్రలోనూ కోలాహలం** : అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో నామినేషన్ల దాఖలు సందడిగా సాగింది. అనకాపల్లి జిల్లా రోలుగుంట, రావికమతం, మాకవరపాలెం, గొలుగొండ ప్రాంతాల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామపత్రాలు సమర్పించారు.

**అడ్డంకులుంటే రక్షణ కల్పించాలి** : నామినేషన్ల దాఖలుకు ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది. అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు అవసరమైన రక్షణ కల్పించాలని రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులకు సూచించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీలు తగిన చర్యలు తీసుకోవాలని, నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని స్పష్టం చేసింది.

**తుది జాబితాపైనే ఉత్కంఠ** : నామినేషన్ల దాఖలు ముగియడంతో అభ్యర్థుల భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. పరిశీలనలో ఎన్ని నామినేషన్లు ఆమోదం పొందుతాయి? ఎన్ని తిరస్కరణకు గురవుతాయి? తుది జాబితాలో ఎవరెవరు నిలుస్తారు? అన్నది ఈ నెల 25న స్పష్టంకానుంది. ఆ తర్వాతే పరిషత్ ఎన్నికల పోరులో అసలు బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది.

# రాష్ట్రానికి భారీ వర్ష సూచన

(మొదటి పేజీ తరువాయి)

తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం రాయలసీమ జిల్లాలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

మంగళవారం విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధవారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు.

# కూటమిలో సీట్ల సర్దుబాటుపై కసరత్తు



(మొదటి పేజీ తరువాయి)

పవన్‌తో 40 నిమిషాల భేటీ : ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబుతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సుమారు 40 నిమిషాలపాటు జరిగిన ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల తాజా పరిణామాలు, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీల బలాబలాలు, సీట్ల పంపకాలపై చర్చించినట్లు సమాచారం. మూడు పార్టీలకు చెందిన పలువురు ఆశావహులు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేయడంతో అభ్యర్థుల ఎంపిక, పరస్పర సమన్వయం అధినేతలకు సవాలుగా మారింది.

మున్సిపల్ ఫార్ములాపైనే ఆసక్తి : ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకాలకు ఒక ఫార్ములా అమలైనట్లు తెలుస్తోంది. మొత్తం 123 స్థానాల్లో జనసేనకు 24, బీజేపీకి 9 స్థానాలు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తారా? లేక గ్రామీణ ప్రాంతాల్లో ఆయా పార్టీలకు ఉన్న పట్టును బట్టి సీట్ల కేటాయింపుల్లో మార్పులు చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

30 శాతం సీట్లు కోరినట్లు ప్రచారం : గ్రామీణ స్థానిక ఎన్నికల్లో జనసేనకు 30 శాతం సీట్లు కేటాయించాలని పవన్ కల్యాణ్ కోరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే స్థానికంగా పార్టీల బలాబలాలను పరిగణనలోకి తీసుకొని సీట్ల సర్దుబాటు చేసుకుందామని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. దీనిపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

మాధవ్‌తోనూ చంద్రబాబు చర్చలు : పవన్ కల్యాణ్‌తో సమావేశం అనంతరం చంద్రబాబు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తోనూ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో బీజేపీకి కేటాయించాల్సిన సీట్లు, స్థానికంగా పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు తెలుస్తోంది. మూడు పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధించే దిశగా నాయకత్వం ప్రయత్నాలు కొనసాగిస్తోంది.

రెబల్స్‌ను బుజ్జగించడమే అసలు పరీక్ష : సీట్ల పంపకాలతోపాటు అసంతృప్త నేతలను బుజ్జగించడం కూటమి పార్టీలకు మరో ప్రధాన సవాలుగా మారింది. ఆశించిన స్థానం దక్కని నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిస్తే కూటమి అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా అసంతృప్తులను సముదాయించి, రెబల్ అభ్యర్థులను పోటీ నుంచి తప్పించడంపై పార్టీలు దృష్టి సారించాల్సి ఉంది.

సమన్వయమే విజయానికి కీలకం : మిత్రపక్షాల ప్రయోజనాలు, స్థానిక నాయకుల ఆకాంక్షలు, క్షేత్రస్థాయిలో పార్టీల బలం.. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ సీట్ల పంపకాలు చేపట్టడం కూటమి నాయకత్వానికి పరీక్షగా మారింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ మధ్య జరుగుతున్న చర్చలు సీట్ల సర్దుబాటుకు ఎంతవరకు మార్గం సుగమం చేస్తాయి? అసంతృప్తులను సముదాయించి కూటమి ఐక్యతను నిలబెట్టుకోగలరా? అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# పోలీసుల సంయమనాన్ని బలహీనతగా భావించొద్దు



(మొదటి పేజీ తరువాయి)

ఒక్కో ఘటన నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ కేసుల్లో ఇప్పటివరకు 17 మంది నిందితులను గుర్తించామని, మిగిలినవారి కోసం దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించినట్లు వివరించారు.

**సూత్రధారులపైనా నిఘా** : ఎన్నికల సందర్భంగా ఘర్షణలకు పాల్పడేవారితోపాటు వాటిని వెనుక నుంచి నడిపించే సూత్రధారులపైనా చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు. అల్లర్లకు ప్రణాళికలు రూపొందించేవారు, అవసరమైన సామగ్రిని సమకూర్చేవారు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఘటనలకు సంబంధించిన ఆధారాల సేకరణలో సీసీటీవీ ఫుటేజీలు, డ్రోన్ దృశ్యాలు, పోలీసుల బాడీ కెమెరా రికార్డింగులు, మీడియా క్లిప్పింగులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

**ఆధారాలుంటేనే నివారణ చర్యలు** : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకునే నివారణాత్మక చర్యలు నిబంధనలకు అనుగుణంగానే ఉంటాయని డీజీపీ పేర్కొన్నారు. రాజకీయ అనుబంధం ఉందని, ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని మాత్రమే ఎవరిపైనా కేసులు నమోదు చేయడం లేదన్నారు. తగిన ఆధారాలున్నప్పుడే సంబంధిత వివరాలను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు ఉంచుతున్నట్లు తెలిపారు. బైండోవర్ చర్యలు శాంతిభద్రతల పరిరక్షణ కోసమేనని, వాటివల్ల అభ్యర్థుల ఎన్నికల్లో పోటీ చేసే అర్హతకు ఆటంకం కలగదని వివరించారు.

**అనుమతులు తప్పనిసరి** : ఎన్నికల ప్రచార ర్యాలీలు, బహిరంగ సభలు, లౌడ్‌స్పీకర్ల వినియోగం రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు, ముందస్తు అనుమతులకు లోబడి ఉండాలని డీజీపీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే అనుమతులు రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేంజ్ డీఐజీలు, ఐజీలు, జిల్లా ఎస్పీలు క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించినట్లు తెలిపారు.

**ప్రతి ఒక్కరి హక్కుకు రక్షణ** : ఎన్నికల్లో చట్టబద్ధంగా పాల్గొనే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ఓటర్ల హక్కులను కాపాడటం పోలీసుల బాధ్యత అని డీజీపీ పేర్కొన్నారు. బెదిరింపులు, మూక హింస, చట్టబద్ధమైన ఆదేశాల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. నిబంధనల పరిధిలో వ్యవహరించే వారందరికీ రక్షణ ఉంటుందని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై మాత్రం చట్టప్రకారం కఠిన చర్యలు

# పారా క్రీడల్లో భారత్ రికార్డుల జోరు




(మొదటి పేజీ తరువాయి)

భారత అథ్లెట్ సందీప్ కుమార్ అద్భుత ప్రదర్శన చేశాడు. ఈ పరుగును 52.28 సెకన్లలో పూర్తి చేసి ప్రపంచ రికార్డుతో పాటు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. సౌదీ అరేబియాకు చెందిన నూర్ అల్సనా రెండో స్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో మరో భారత అథ్లెట్ అజయ్ కుమార్ 53.61 సెకన్లతో మూడో స్థానాన్ని సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు.

జావెలిన్‌లో హనీ సంచలనం : పురుషుల జావెలిన్ త్రో ఎఫ్-37 విభాగంలో భారత అథ్లెట్ హనీ రికార్డుల మోత మోగించాడు. ఐదో ప్రయత్నంలో 59.72 మీటర్ల దూరం విసిరి ప్రపంచ రికార్డు నమోదు చేశాడు. చివరి ప్రయత్నంలో 60.49 మీటర్లతో తన రికార్డును తానే అధిగమించాడు. ఈ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

షూటింగ్‌లో మోనా అగర్వాల్ గురి : మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ విభాగంలో భారత షూటర్ మోనా అగర్వాల్ 357.5 పాయింట్ల రికార్డు స్కోరుతో పసిడి పతకం సాధించింది. ఈ క్రమంలో స్వీడన్ షూటర్ అన్నా బెన్సన్ పేరిట ఉన్న 356 పాయింట్ల ప్రపంచ రికార్డును అధిగమించింది. అంతకుముందు మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్-1 విభాగంలోనూ మోనా స్వర్ణ పతకం సాధించడం విశేషం.

గత రికార్డును అధిగమించి.. : ఐదో ఆసియా పారా క్రీడల్లో భారత్ ఇప్పటివరకు 114 పతకాలు సాధించింది. వీటిలో 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్యాలు ఉన్నాయి. చైనాలో జరిగిన నాలుగో ఆసియా పారా క్రీడల్లో భారత్ సాధించిన 108 పతకాల రికార్డును ఈసారి అధిగమించింది. దీంతో భారత పారా అథ్లెట్లు అంతర్జాతీయ వేదికపై తమ సత్తాను మరోసారి చాటారు.

నేటితో ముగింపు : ఐదో ఆసియా పారా క్రీడలకు శనివారంతో తెరపడనుంది. ముగింపు దశకు చేరుకున్న పోటీల్లో భారత అథ్లెట్ల రికార్డు ప్రదర్శన దేశ క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. ప్రపంచ రికార్డులు, స్వర్ణ పతకాలతో భారత్ సాధించిన ఈ ఘనత పారా క్రీడల్లో దేశ ప్రస్థానానికి కొత్త ఉత్సాహాన్నిచ్చింది.

# అమితాబ్ బచ్చన్ బంగ్లాను పేల్చేస్తామంటూ బెదిరింపు



(మొదటి పేజీ తరువాయి)

అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

ఈ-మెయిల్‌పై దర్యాప్తు : పాఠశాలకు వచ్చిన బెదిరింపు సందేశంపై పోలీసులు దృష్టి సారించారు. ఈ-మెయిల్ మూలాలు, అందులో పేర్కొన్న వివరాలను పరిశీలిస్తున్నారు. బెదిరింపు నిజమైనదేనా? లేక ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు పంపిన సందేశమా? అన్న కోణాల్లో విచారణ చేపట్టినట్లు సమాచారం. అయితే ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

గతంలోనూ ఇలాంటి బెదిరింపులు : ముంబయిలో గతంలోనూ ఇలాంటి బెదిరింపు ఈ-మెయిళ్లు కలకలం సృష్టించాయి. నగరపాలక సంస్థ కార్యాలయానికి బెదిరింపు సందేశం రావడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అయితే ఎలాంటి అనుమానాస్పద వస్తువులూ లభించలేదు.

ప్రెస్ క్లబ్‌కూ హెచ్చరిక : ఈ ఏడాది మార్చి 20న ముంబయి ప్రెస్ క్లబ్‌కు కూడా బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. భవనంలో విషవాయువుతో కూడిన చిన్న బాంబులు అమర్చినట్లు అందులో పేర్కొన్నట్లు సమాచారం. అప్పట్లోనూ తనిఖీలు చేపట్టిన అధికారులు ఎలాంటి ప్రమాదకర వస్తువులనూ గుర్తించలేదు.

కొనసాగుతున్న విచారణ : తాజా బెదిరింపు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ-మెయిల్ పంపిన వ్యక్తిని గుర్తించడం, సందేశం వెనుక ఉద్దేశాన్ని నిర్ధారించడంపై దృష్టి సారించారు. ఘటనకు సంబంధించిన అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

# చైనా సరిహద్దులో ఇంకా ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

అరుణాచల్ సరిహద్దులో ఘర్షణలు : అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులోని పలు ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా ఘర్షణలు జరిగాయని, అవి ఇంకా కొనసాగుతున్నాయని శత్రుజీత్ కపూర్ పేర్కొన్నట్లు వార్తా కథనం వెల్లడించింది. ఐటీబీపీ సిబ్బంది సేవలను గుర్తిస్తూ నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న శౌర్య కమాండోలు క్లిష్ట పరిస్థితుల్లోనూ సమర్థంగా పనిచేస్తున్నారని తెలిపారు.

చైనా సరిహద్దు అత్యంత క్లిష్టం : చైనాతో ఉన్న సరిహద్దు అత్యంత సవాలుతో కూడుకున్నదని ఐటీబీపీ డీజీ పేర్కొన్నారు. తొలుత పర్వత ప్రాంతాల్లో పోరాడే గెరిల్లా దళంగా ఐటీబీపీని ఏర్పాటు చేశారని, 2004లో చైనా సరిహద్దు భద్రత బాధ్యతలను అప్పగించారని వివరించారు. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

గల్వాన్ తరహా ఘర్షణలకు సన్నద్ధత : గల్వాన్ తరహా ఘర్షణలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించినట్లు శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. సరిహద్దుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. చైనాతో భారత్‌కు ఉన్న 3,488 కిలోమీటర్ల వాస్తవాధీన రేఖ వెంబడి ఐటీబీపీ సిబ్బంది పహారా కాస్తున్నారు. ఎత్తైన ప్రాంతాల్లో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడంలో శౌర్య కమాండోలకు ప్రత్యేక నైపుణ్యం ఉందని వివరించారు.

కేంద్రం సమాధానం చెప్పాలి: కాంగ్రెస్ : అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులో ఘర్షణలు జరుగుతున్నాయన్న వార్తలపై కాంగ్రెస్ స్పందించింది. జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేసింది. సరిహద్దు పరిస్థితులపై మౌనం వహిస్తూ, చైనాకు రాయితీలు కొనసాగిస్తోందని విమర్శించింది.

లద్దాఖ్‌లో మాదిరిగానే కొన్ని పెట్రోలింగ్ పాయింట్ల విషయంలో సమస్యలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నట్లు కాంగ్రెస్ పేర్కొంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలకు చైనా పేర్లు మార్చడం, భారత్‌కు ముప్పు కలిగించేలా ఆనకట్ట నిర్మిస్తోందన్న అంశాలనూ ప్రస్తావించింది. దేశ భద్రతకు సంబంధించిన పరిణామాలపై కేంద్రం వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరింది.

ఐటీబీపీ డీజీ వ్యాఖ్యలు, కాంగ్రెస్ విమర్శల నేపథ్యంలో భారత్-చైనా సరిహద్దు పరిస్థితులపై మరోసారి చర్చ మొదలైంది. సరిహద్దుల్లో వాస్తవ పరిస్థితులు ఏమిటి? ఘర్షణలు ఏ ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయి? వాటిపై కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఏమైనా వివరాలు వెల్లడిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# జడ్పీటీసీ అభ్యర్థిగా శ్రీరామ్ నామినేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి హడావుడి లేకుండా నిరాడంబరంగా ఈ ప్రక్రియ పూర్తి చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

నామినేషన్ల స్వీకరణకు చివరి రోజైన శుక్రవారం, పరిటాల శ్రీరామ్ కొత్తచెరువులోని శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన వెంట కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్. రాజు ఉన్నారు. కదిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని నల్లచెరువు నుంచి ఆయన పోటీకి దిగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవిని కైవసం చేసుకునే వ్యూహంలో భాగంగానే, టీడీపీ అధిష్ఠానం పరిటాల శ్రీరామ్‌ను జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దించినట్లు తెలుస్తోంది. జిల్లా జడ్పీ ఛైర్మన్ అభ్యర్థిగా ఆయనే ఉంటారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. నవంబర్ 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు జరగనుంది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల గడువు ముగిశాక తుది అభ్యర్థుల జాబితా వెలువడనుంది.

# చైనాలో భూకంప బీభత్సం

**జిజాంగ్:** భారీ భూకంపం చైనాను వణికించింది. ఒక్కసారిగా కంపించిన భూమితో ఇళ్లు, మౌలిక వసతులు దెబ్బతినగా.. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. జిజాంగ్ స్వయంప్రతిపత్తి ప్రాంతంలోని నగ్చు నగర పరిధిలో ఉన్న బాకెన్ కౌంటీలో గురువారం రాత్రి సంభవించిన ఈ ప్రకృతి విపత్తులో 16 మంది మృతి చెందగా, మరో 76 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శిథిలాల తొలగింపు, బాధితుల గాలింపు, వైద్య సహాయం అందించేందుకు భారీ స్థాయిలో సహాయక చర్యలు చేపట్టారు.

**రంగంలోకి 5 వేల మందికిపైగా సిబ్బంది:** గురువారం రాత్రి 10.33 గంటలకు భూకంపం సంభవించినట్లు చైనా అధికారులు శుక్రవారం తెలిపారు. బాధితులను ఆదుకునేందుకు, శిథిలాల కింద చిక్కుకున్నవారి కోసం గాలించేందుకు 5 వేల మందికిపైగా సిబ్బందిని రంగంలోకి దించారు. వైద్య సేవలు, తాత్కాలిక ఆశ్రయాలు, నిత్యావసరాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించారు. సహాయక చర్యలను సమన్వయం చేసేందుకు ఘటనాస్థలంలో ప్రత్యేక కమాండ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 12 వేల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చైనా ప్రభుత్వ వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది.



**రోడ్లు, వంతెనలపై తనిఖీలు** : భూకంప ప్రభావంతో రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక వసతులకు జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. రోడ్డు రవాణా శాఖ, పోలీసులు 1,700 కిలోమీటర్లకు పైగా రహదారులు, 201 వంతెనలు, 324 కల్వర్టులను పరిశీలించారు. ఈ క్రమంలో 11 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించారు. ఏడు చోట్ల రహదారులపై పడిన రాళ్లను తొలగించి రాకపోకలకు ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టారు.

**విద్యుత్, సమాచార వ్యవస్థల పునరుద్ధరణ** : భూకంపం కారణంగా దెబ్బతిన్న విద్యుత్, టెలికమ్యూనికేషన్ వ్యవస్థలను పునరుద్ధరించే పనులు కొనసాగుతున్నాయి. పర్వత వాలులు, జలాశయాలు, విద్యుత్ కేంద్రాలు, నదులు, దెబ్బతిన్న భవనాలు, సమాచార కేంద్రాల వద్ద అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. భూకంపం అనంతర ప్రకంపనలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు భూకంప పర్యవేక్షణ, వాతావరణ, అత్యవసర నిర్వహణ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

**బాధితులకు అత్యవసర సామగ్రి** : చైనా రెడ్‌క్రాస్ సహాయక బృందాన్ని ప్రభావిత ప్రాంతానికి పంపింది. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయక సామగ్రితోపాటు పరిశుభ్రత కిట్లు, హీటర్లు, గుడారాలు, జాకెట్లు, మడత పడకలు, దుప్పట్లను అందించింది. మరోవైపు చైనా ఛారిటీ ఫెడరేషన్ అత్యవసర సహాయక చర్యల కోసం 30 లక్షల యువాన్లను కేటాయించింది.

**కొనసాగుతున్న సహాయక చర్యలు** : భూకంపం కారణంగా దెబ్బతిన్న నివాసాలు, మౌలిక వసతుల నష్టంపై అధికారులు అంచనాలు కొనసాగిస్తున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత ఆశ్రయాలు కల్పించడం, అత్యవసర సేవలను అందించడం, మరిన్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించారు. భూకంపానంతర ప్రకంపనలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# తెనాలిలో కూటమి ప్రచార హోరు.. అడుగడుగునా ప్రజల నీరాజనం

## చైర్‌పర్సన్, కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్సీ ఆలపాటి, మంత్రి మనోహర్ ఇంటింటి ప్రచారం







**తెనాలి, అక్టోబరు 23(జర్నలిస్ట్ ఫైల్) :** తెనాలి పట్టణంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం జోరందుకుంది. 27, 28, 29, 30, 31, 32 వార్డుల్లో కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థి తోటకూర వెంకట రమణారావు, కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మంత్రి మనోహర్ విస్తృతంగా పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా పార్టీ శ్రేణులు, అభిమానులు నాయకులకు ఘన స్వాగతం పలుకుతూ ఉత్సాహం నింపారు. ప్రచారంలో భాగంగా నాయకులు ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తెనాలి పట్టణంలో మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రతి వార్డు అభివృద్ధికి కూటమి అభ్యర్థులు కట్టుబడి పనిచేస్తారని తెలిపారు.

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, ఉత్సాహం కూటమి అభ్యర్థుల విజయానికి సంకేతంగా నిలుస్తున్నాయని అన్నారు. తెనాలి పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ప్రజల సహకారంతో సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ప్రతి వార్డులో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

మంత్రి మనోహర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, తెనాలి పట్టణ ప్రగతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. "ప్రజల నమ్మకమే మా బలం.. అభివృద్ధే మా లక్ష్యం.. తెనాలి ప్రగతికి కూటమి విజయమే పునాది" అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలతో ప్రచారాన్ని హోరెత్తించారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.











# బ్రహ్మంగారి మఠం కథ శృంగేరి కంచి మఠాధీశుల చేతిలోకి?




- మఠాధిపతి అర్హత పరీక్ష అంశంలో మరో బిగ్ ట్విస్ట్
- బ్రహ్మంగారి మఠం మఠాధిపతి కోసం అర్హత పరీక్ష అంశం కంచికి చేరిందా?

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఉన్నత న్యాయస్థానం చాగంటి కోటేశ్వర రావుతో బ్రహ్మం గారిమఠం మఠాధిపతిగా పోటీలో ఉన్నటువంటి ముగ్గురికి అర్హత పరీక్ష పెట్టించే అంశం గురించి సూచనలు చేయమని ప్రభుత్వంను అడగ్గా
ప్రభుత్వం వారితో పాటుగా ప్రముఖ ప్రవచానకారులు గరికపాటి నరసింహారావు
వేద వేదాంగాలలో మహా మేధావి సామవేదం షణ్ముఖ శర్మ, శృంగేరి పీఠం (గతంలో ధార్మిక పరిషత్ సభ్యులు) నుంచి పూజ్య విదు శేఖర భారతి స్వామీజీ, కంచి మఠాధిపతి పూజ్య విజయేంద్ర సరస్వతి స్వామిజీ గార్లతో ఒక కమిటీ ఏర్పాటు చేసిమేము అర్హత పరీక్ష పెట్టి మఠాధిపతిని పునర్నియామకం చేస్తామని హైకోర్టుకు నివేదించే అవకాశ మున్నదని ఆ అంశము తీవ్రంగా పరిశీలన చేస్తున్నట్టు అభిఙ్ఞ వర్గాల బోగట్ట! ఈ విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకొన్న శిష్యులు, భక్తులు, హిందూ ఆధ్యాత్మిక వేత్తలు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

# చైనా సైనిక చొరబాట్లతోనే సరిహద్దుల్లో ఉద్రిక్తతలు: భారత్



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** భారత్- చైనా సరిహద్దుల్లో శాంతి భద్రతల పునరుద్ధరణ, ఇరాన్‌కు మానవతా సహాయం వంటి అంశాలపై భారత విదేశాంగ శాఖ శుక్రవారం రోజు కీలక వ్యాఖ్యలు చేసింది. వాస్తవాధీన రేఖ వెంబడి చైనా దళాలు ముందస్తుగా నిర్దేశించుకున్న గస్తీ (పాట్రోలింగ్) విధానాల నుంచి వైదొలగడం సహా ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయని పేర్కొంది. ఈ క్రమంలోనే సరిహద్దుల్లో తరచుగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడుతోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలన్నా, ముందుకు సాగాలన్నా సరిహద్దు ప్రాంతంలో శాంతి, సామరస్యాలు నెలకొనడం అత్యంత ముఖ్యమని మరోసారి భారత్ వైఖరిని ఆయన వెల్లడించారు.

అరుణాచల్ ప్రదేశ్‌లోని సరిహద్దు వెంబడి పలు ప్రాంతాల్లో చైనా సైనికులతో ఇంకా ఘర్షణ జరుగుతూనే ఉందని, ఇండో- టిబెటన్ బోర్డర్ పోలీస్ డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ చేసిన వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇలా స్పందించింది. గతంలో తాము నిరూపించినట్లుగానే చైనా సైన్యం నిబంధనలు అతిక్రమిస్తుండటం వల్లే సరిహద్దుల్లో శాంతి భద్రతలకు భంగం కలుగుతోందని జైస్వాల్ గుర్తుచేశారు. అయితే సరిహద్దు వివాదాల పరిష్కారానికి ఇరు దేశాలు దౌత్య, సైనిక మార్గాల్లో చర్చలను కొనసాగిస్తున్నామని తెలిపింది.

"వాస్తవాధీన రేఖ వెంబడి ఎలాంటి అపోహలకు, పొరపాట్లకు తావులేకుండా చూసేందుకు, ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి ఇరు పక్షాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్న దౌత్య, సైనిక వ్యవస్థలను నిరంతరాయంగా ఉపయోగించుకుంటున్నాయి." రాజస్థాన్ అల్వార్‌లో గురువారం మాట్లాడిన ఐటీబీపీ డీజీ శత్రుజీత్ చైనా సరిహద్దు వెంబడి ఇప్పటికీ ప్రతిష్టంభన కొనసాగుతోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే సరిహద్దు భద్రత కోసం తమ దళంలోని అన్ని బార్డర్ యూనిట్లలో డ్రోన్ ప్లాటూన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గల్వాన్ లోయ తరహా ఘర్షణ పరిస్థితుల్ని సమర్థంగా ఎదుర్కోవడానికి కొత్త తరహా 'స్ట్రైక్' కోర్సును కూడా సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

# ఎమ్మెల్సీగా మాకు ఏ.ఎస్.రామకృష్ణే కావాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేట్ విద్యాసంస్థల సంఘాల సంపూర్ణ మద్దతు



**గుంటూరు, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్):** 2027లో జరగనున్న కృష్ణా-గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న డాక్టర్ ఏ.ఎస్. రామకృష్ణకు వివిధ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన ఎన్నికల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి సంఘాల ప్రతినిధులు ఈ మేరకు ప్రకటించారు. ఏపీయూఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు తులసి విష్ణు ప్రసాద్, ఏపీపీఎస్ఏ డెమొక్రటిక్ రాష్ట్ర అధ్యక్షుడు జి. మోహన్ రావు, ఏపీపీఎస్ఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు సాదినేని మురళి, పీటీఏపీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు కె. బాబ్జీ తదితరులు మాట్లాడుతూ.. 2015-2021 మధ్య కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలో డాక్టర్ రామకృష్ణ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రైవేట్ టీచర్లు, యాజమాన్యాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ప్రైవేట్ విద్యారంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించేందుకు ఆయన అనుభవం అవసరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి కోసం పనిచేస్తారని విశ్వాసంతో డాక్టర్ రామకృష్ణకు మద్దతు ఇవ్వాలని సంఘాలు ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఎన్ఆర్ఐ విద్యాసంస్థల డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావుతో పాటు పలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జాతీయ సారస్ మేళా-2026లో రూ.6.50 కోట్ల అమ్మకాలు

## పున్నమి ఘాట్‌లో సాంస్కృతిక ప్రదర్శనలకు విశేష స్పందన




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ సారస్ ఆజీవిక మేళా-2026లో అక్టోబర్ 22 నాటికి మొత్తం రూ.6.50 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఈ సందర్భంగా 2.55 లక్షల ఉత్పత్తులు విక్రయించబడ్డాయి. అక్టోబర్ 22 ఒక్కరోజే రూ.71.09 లక్షల విలువైన 25,320 ఉత్పత్తులు అమ్ముడయ్యాయి. ఆ రోజు మేళాను 45,000 మందికి పైగా సందర్శించారు. ఈ మేళా స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ కళాకారులకు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించుకోవడానికి గణనీయమైన అవకాశాలను కల్పిస్తోంది.

భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటిన సాంస్కృతిక కార్యక్రమాలు

అక్టోబర్ 22న సాయంత్రం 6:00 గంటల నుంచి రాత్రి 9:00 గంటల వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు మేళాకు మరింత శోభను చేకూర్చాయి. ఈ ప్రదర్శనలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. దీంతో ప్రదర్శన, విక్రయ స్టాళ్లను సందర్శించే వారి సంఖ్య కూడా పెరిగింది.

ఈ సాంస్కృతిక సాయంత్రంలో వేదపెదిద సత్యరామ కూచిపూడి అకాడమీ, విశ్వభారతి కూచిపూడి ఆర్ట్ అకాడమీల ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు, లడఖ్ సంప్రదాయ గేయాలు, నృత్యాలు, అలపాటి రమేష్ కృష్ణ గాత్ర సంగీత ప్రదర్శన, సీతాపేటకు చెందిన సవర గిరిజన కళాకారులు, వై. షెరిషా బృందం భరతనాట్యం, భీమవరానికి చెందిన నాగరాజు గారు సమర్పించిన శతమానం భవతి, కె. మధుసూదనరావు నిర్వహించిన భగవద్గీత పారాయణం వంటి వైవిధ్యభరితమైన కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డా. జి. లక్ష్మీశ, ఐఏఎస్, ప్రదర్శనల్లో పాల్గొన్న చిన్నారులు, కళాకారులను అభినందించారు. భారతదేశ గొప్ప సాంస్కృతిక సంప్రదాయాలను చాటిచెప్పడంలో వారు చేసిన కృషిని ప్రశంసించారు. ప్రేక్షకుల నుంచి ఈ ప్రదర్శనలకు విశేష స్పందన లభించింది.

లడఖ్ మహిళల సంప్రదాయ గేయాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ

జాతీయ సారస్ మేళా-2026లో భాగంగా లడఖ్‌కు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రదర్శించిన సంప్రదాయ గేయాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లో అలరించిన మహిళలు తమ ప్రాంతపు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, జానపద సంప్రదాయాలను, కళాత్మక వైభవాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. వారి ప్రదర్శనకు సందర్శకుల నుంచి ఉత్సాహభరితమైన స్పందన లభించింది. భారతదేశంలోని భిన్న సంస్కృతుల సమ్మేళనాన్ని, "భిన్నత్వంలో ఏకత్వం" అనే స్ఫూర్తిని ఈ ప్రదర్శన చాటిచెప్పింది.

ఈ సాంస్కృతిక కార్యక్రమాలు దేశంలోని కళ, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించడమే కాకుండా, మేళా స్టాళ్ల వద్ద సందర్శకుల రాకపోకలను, ఆసక్తిని పెంచాయి. ఫలితంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించుకోవడానికి మరిన్ని అవకాశాలు లభించాయి.

జాతీయ సారస్ మేళా దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నడిచే వ్యాపారాలకు గ్రామీణ పారిశ్రామికాభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారత, సాంస్కృతిక మార్పిడి, మార్కెట్ అనుసంధానం కల్పించే ఒక కీలక వేదికగా కొనసాగుతోంది.

# ఉన్నత విద్యారంగంలో పరిశోధనాత్మక మార్పుల కోసం ఆంధ్రప్రదేశ్ పిలుపు



- గోవాలో ఎకనామిక్ టైమ్స్ ఎడ్యుకేషన్ ఛాన్సలర్స్ కాంక్లేవ్ 2026లో డాక్టర్ హెచ్. పురుషోత్తం కీలక ఉపన్యాసం
- పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమల సహకారం మరియు సరికొత్త సాంకేతికతలకు ప్రాధాన్యత

**గోవా:** విశ్వవిద్యాలయాలను కేవలం సాంప్రదాయ విద్యా కేంద్రాలుగా కాకుండా పరిశోధన, ఆవిష్కరణలు, వ్యవస్థాపకత మరియు సాంకేతిక పురోగతికి నిలయాలుగా మార్చాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ సైన్స్, టెక్నాలజీ & ఇన్నోవేషన్ శాఖ సెక్రటరీ డాక్టర్ హెచ్. పురుషోత్తం పిలుపునిచ్చారు. గోవా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో, గోవాలోని నొవాటెల్ గోవా డోనా సిల్వియా రిసార్ట్‌లో నిర్వహించిన "ఎకనామిక్ టైమ్స్ ఎడ్యుకేషన్ ఛాన్సలర్స్ కాంక్లేవ్ 2026" సదస్సులో ఆయన పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సును గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు.

"లీడర్‌షిప్ టు లెగసీ: రీడిఫైనింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్" (నాయకత్వం నుండి వారసత్వం : ఉన్నత విద్య భవిష్యత్తును పునర్నిర్వచించడం) అనే ఇతివృత్తంపై డాక్టర్ పురుషోత్తం ప్రసంగించారు. శాస్త్రీయ పరిశోధనలను పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మార్చడానికి మరియు డీప్-టెక్ స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ప్రభుత్వం, విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య బలమైన సహకారానికి విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికతలను ఉన్నత విద్యలో భాగం చేయాల్సిన అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా వివరించారు. నాణ్యమైన విద్యా బోధనతో పాటు విద్యార్థులకు ఉపాధి కల్పించే నైపుణ్య ఆధారిత విద్యను అందించాలన్నారు. దేశ సాంకేతిక సామర్థ్యాలను, ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి విశ్వవిద్యాలయాలలో బలమైన పరిశోధనా మౌలిక సదుపాయాలు, పేటెంట్ సృష్టి మరియు అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు అవసరమన్నారు. సాంప్రదాయ విద్యా విధానాల పరిధిని దాటి, అర్థవంతమైన పరిశోధనలు మరియు ఆవిష్కరణల ద్వారా సమాజంపై శాశ్వతమైన, సానుకూల ప్రభావాన్ని చూపాలని విద్యాసంస్థలకు డాక్టర్ పురుషోత్తం పిలుపునిచ్చారు.

విశ్వవిద్యాలయాలు సాంప్రదాయ బోధనా పద్ధతులను దాటి ముందుకు సాగాలని, అర్థవంతమైన పరిశోధనలు, ఆవిష్కరణలు మరియు పరిశ్రమలతో భాగస్వామ్యాల ద్వారా సమాజంపై శాశ్వతమైన ప్రభావాన్ని చూపాలని ఆయన కోరారు. తద్వారా భారతదేశ సాంకేతిక సామర్థ్యాలు మరియు ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయవచ్చని ఆయన పిలుపునిచ్చారు.



# ఎంపిటిసి, జెడ్‌పిటిసి నామినేషన్ల గడువు పొడిగించాలని పిటిషన్




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేయకుండా అభ్యర్థులను అడ్డుకున్న ప్రాంతాల్లో గడువును కనీసం 48 గంటలు పొడిగించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ వైసిపి శుక్రవారం హైకోర్టులో అత్యవసర లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడంతోపాటు దాడులు, బెదిరింపులు, నామినేషన్ పత్రాల ధ్వంసానికి పాల్పడిన వారిపై రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేసేలా పోలీసులను ఆదేశించాలని అభ్యర్థించింది. న్యాయమూర్తి జస్టిస్ గంధం సునీత ఈ వ్యాజ్యంపై విచారణ జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. వైసిపి అభ్యర్థులు ఎంపిటిసి ఎన్నికల్లో ఇప్పటి వరకు 12,500 నామినేషన్లను దాఖలు చేశారని తెలిపారు. అక్కడక్కడ జరిగిన కొన్ని ఘటనలను చూపి రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని చెప్పడం సరికాదన్నారు. ఇరుపక్షాల వాదనలు నమోదు చేసిన న్యాయమూర్తి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

# తెలంగాణ పోరాట యోధుడికి ఘన నివాళి

- పొద్దుటూరులో పండుగల సాయన్న జయంతి వేడుకలు
- దొరల గుండెల్లో నిద్రపోయిన వీరుడు సాయన్న: సర్పంచ్ బండ లక్ష్మీ నర్సింహ



**శంకర్‌పల్లి, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ గడ్డపై సామాజిక అసమానతలను, దొరలు-భూస్వాముల ఆధిపత్యాన్ని ఎదిరించి పేదల పక్షాన నిలిచిన పోరాట యోధుడు పండుగల సాయన్న జయంతి వేడుకలను శంకర్‌పల్లి మండలం పొద్దుటూరు గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు, మహిళలు పాల్గొని సాయన్నకు ఘన నివాళులర్పించారు. ఈ వేడుకలకు శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పండుగల సాయన్న చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్లు,కోలాటాల నడుమ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. జై తెలంగాణ.. జై సాయన్న నినాదాలతో గ్రామంలో సందడి నెలకొంది.

**సాయన్న పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం**

ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..పండుగల సాయన్న ప్రజల హక్కుల కోసం పోరాడిన ధీరుడిగా తెలంగాణ చరిత్రలో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పేదలు,బలహీన వర్గాల పక్షాన నిలిచి అన్యాయాలను ఎదిరించిన ఆయన పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సాయన్న జీవిత చరిత్రను,ఆయన పోరాటాల ప్రాధాన్యతను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

**దొరల గుండెల్లో నిద్రపోయిన వీరుడు సాయన్న**

గ్రామ సర్పంచ్ బండ లక్ష్మీ నర్సింహ మాట్లాడుతూ.. దొరల ఆధిపత్యాన్ని ధైర్యంగా ఎదిరించి ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిన వీరుడు పండుగల సాయన్న అని కొనియాడారు. ముదిరాజ్ సమాజానికే కాకుండా యావత్ తెలంగాణకు ఆయన స్ఫూర్తిదాయకమని అన్నారు. పొద్దుటూరు గ్రామంలో జయంతి వేడుకలను నిర్వహించడం గర్వకారణమని, సాయన్న ఆశయాలను యువతకు పరిచయం చేస్తూ ప్రతి ఏటా వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. ఉప సర్పంచ్ కావేలి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. పండుగల సాయన్న చరిత్రను భావితరాలకు అందించేందుకు పాఠ్యపుస్తకాల్లో ఆయన జీవిత విశేషాలకు స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కటిక శ్రీనివాస్,వార్డు సభ్యులు ఏనుగు నరేందర్ రెడ్డి,కోటి ప్రశాంత్,ఉమ్మెత్తల శ్వేత వినోద్ కుమార్,నట్టల అనిత రమేష్,కావేలి తిరుపతి రెడ్డి,గ్రామ పెద్దలు కవేలి జంగారెడ్డి,పులకండ్ల రఘుపతి రెడ్డి,ముదిరాజ్ సంఘం సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు. ఐక్యత, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఈ వేడుకలు జై తెలంగాణ.. జై సాయన్న నినాదాలతో ముగిశాయి.

# పేదల పాలిట పెన్నిధి.. పండుగ సాయన్న

- ఆయన పోరాట స్ఫూర్తి, సామాజిక న్యాయం నేటి యువతకు ఆదర్శం
- పాలమూరు యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్
- పాలమూరు యూనివర్సిటీలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



**మహబూబ్‌నగర్, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** పేదల సంక్షేమం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ అన్నారు. గురువారం యూనివర్సిటీలో బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని, సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పండుగ సాయన్న పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజావీరుడని కొనియాడారు. పేదల ఆకలి బాధలను తన బాధలుగా భావించి, అన్యాయాన్ని ఎదిరిస్తూ అణగారిన వర్గాలకు అండగా నిలిచిన ధీశాలి అని పేర్కొన్నారు. ధనవంతుల అక్రమ సంపదను పేదలకు పంచుతూ నిరుపేదల జీవితాల్లో ఆశలు నింపిన ప్రజానాయకుడిగా ఆయన ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. రైతుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పండుగ సాయన్న సాగించిన పోరాటం ఆయన ధైర్యసాహసాలకు, త్యాగనిరతికి నిదర్శనమని పేర్కొన్నారు. సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ పేదల పక్షాన నిలిచిన ఆయన జీవిత చరిత్రను యువత అధ్యయనం చేయాలని సూచించారు. సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**యువతలో సామాజిక చైతన్యం పెంపొందించాలి:**

విద్యాసంస్థలు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా సామాజిక చైతన్యాన్ని, సమానత్వ భావనను పెంపొందించే కేంద్రాలుగా నిలవాలని ఈ సందర్భంగా వక్తలు అభిప్రాయపడ్డారు. పండుగ సాయన్న వంటి ప్రజావీరుల జీవితాలు, పోరాటాలు విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా సామాజిక బాధ్యతతో కూడిన భావి పౌరులను తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి. రమేష్ బాబు, ఓఎస్డీ ప్రొఫెసర్ డి. మధుసూదన్ రెడ్డి, చీఫ్ వార్డెన్ డాక్టర్ కృష్ణయ్య, జేడీ డాక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాళ్లు డాక్టర్ భూమయ్య, డాక్టర్ ఈశ్వర్ కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎస్.ఎన్. అర్జున్ కుమార్, అధ్యాపకులు తేజవర్ధన్, డాక్టర్ పి. రామరాజు, డాక్టర్ రవీందర్ గౌడ్, బోధనేతర సిబ్బంది సూపరింటెండెంట్ రవీందర్, సాయి కిరణ్, మనోహర్, రాము, జాహ్నవి, బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, విద్యార్థి సంఘం నాయకులు బత్తిన రాము, తయప్ప, పండుగ ఆంజనేయులు, పండుగ సాయి తేజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మలరామారం మండలంలో కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యటన

- సోలిపేటలో మహిళా రైతు క్షేత్రంలో మునగ మొక్కలు నాటారు
- నీటి లభ్యతను అనుగుణంగా పంటలు సాగు చేయాలని రైతులకు సూచన
- పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**బొమ్మలరామారం అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** మండలంలో గురువారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యటించారు. సోలిపేట గ్రామంలో విజయలక్ష్మి అన్నయ్య మహిళా రైతు వ్యవసాయ క్షేత్రంలో వి బి జి రామ్ పథకం ద్వారా 1.5 ఎకరాల్లో మునగ సాగు మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొని మొక్కలు నాటారు. ఉద్యాన శాఖ నుంచి రైతులకు డ్రిప్పు పరికరాలు మునగ మొక్కలను అందజేశారు. మునగ సాగు విధానం నీటి వినియోగం సత్యంమయ్య పంటల ప్రాధాన్యత సంబంధిత అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కలిగించాలని రైతులకు సూచించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి భూగర్భ జలా మట్టాలు తక్కువగా ఉన్నందున భవిష్యత్తులో నీటి కొరత ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ ప్రతి నీటిబొట్టును పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. నీటి లభ్యత తగిన సందర్భాల్లో పంటకు తగినంత నీరు అందగా దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలు ఎంపికలో మార్పులు చేసుకోవాలని తక్కువ నీటిని వినియోగంతో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.



**పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు పరిశీలన..** గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడి భవనాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. దసరా సెలవులు అనంతరం పాఠశాలలు నేటి నుండి ప్రారంభమవుతున్న సందర్భంలో మౌలిక వసతులు కల్పించాలని అలాగే విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని పాఠశాల భవనాన్ని వెంటనే మరపాతులు చేపట్టాలని, కిచెన్ షెడ్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు విద్యార్థులకు త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మల్యాల గ్రామంలోని కేజీబీవీ పాఠశాల, జూనియర్ కళాశాల భవనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను ఈ విద్యా సంవత్సరం నుంచి జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.



శిక్షణ తరగతుల నిర్వహణకు అవసరమైన తరగతి గదులు, విద్యార్థుల వసతి, ఇతర మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు, వారు పోటీ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధమయ్యేందుకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు.

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన వసతి, బోధన సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భిక్షపతి, జిల్లా విద్యాధికారి, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి కె.హేమలత, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట రమణారెడ్డి, బొమ్మలరామారం, తహసిల్దార్ రాధ, ఎంపీడీవో డి.శ్యామల, సోలిపేట గ్రామ సర్పంచ్ పావని ఇంద్రసేనారెడ్డి, విబిజి రామ్ ఏపీవో శ్రీలక్ష్మి, కవిత, పంచాయతీ కార్యదర్శి శైలజ, చారి పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- మిర్యాలగూడలో జరిగిన సదస్సులో ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఖాసీం విశారదన్ మహరాజ్



**మిర్యాలగూడ అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి, సామాజిక న్యాయం అందించాలని వక్తలు డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు విజయ గార్డెన్స్‌లో యునైటెడ్ దళిత క్రైస్తవుల ఫెడరేషన్ (యూ డి సి ఎఫ్) ఆధ్వర్యంలో పెదమామ డేవిడ్ రాజు అధ్యక్షతన దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా సాధన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం, డీఎస్పీ అధినేత డాక్టర్ విశారద, నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడం సామాజిక న్యాయ సాధనలో కీలకమన్నారు. తరతరాలుగా వివక్ష, సామాజిక అసమానతలను ఎదుర్కొంటున్న దళిత క్రైస్తవులకు న్యాయం జరగాలన్నారు. విద్య, ఉపాధి, ఇతర రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత క్రైస్తవుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగబద్ధమైన హక్కులు అందరికీ సమానంగా దక్కేలా కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ విశారద మాట్లాడుతూ దళిత క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి సమాజంలోని అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. ఎస్సీ హోదా అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమానత్వం, గౌరవం, న్యాయం ప్రతి ఒక్కరికీ అందినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి మాట్లాడుతూ దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఎస్సీ హోదా అంశంపై స్పష్టమైన వైఖరి ప్రకటించి, వారికి న్యాయం జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించి, వారి సంక్షేమానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, ప్రొఫెసర్ డాక్టర్ నతనియేలు, మర్రి ఎలియాస్, క్రిస్టోఫర్, నిర్వాహకులు డి.ఐ. శాంసన్, పెదమామ డేవిడ్ రాజు, ఆదిముల్ల ప్రభుదాస్, కడియం అబ్రహం, దుబ్బ డేవిడ్ రాజు, అంబటి ప్రభాకర్, చంద్రపాల్, జయమ్మ, విజయ్, శ్రీనివాస్, డాక్టర్ రాజు తదితరులు, దళిత క్రైస్తవులు పాల్గొన్నారు.

## కడ్తాల్‌లో ఘనంగా ప్రజావీరుడు పండుగల సాయన్న జయంతి

- పేద ప్రజల ఆశాజ్యోతి.. ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీక
- ఆయన వీరత్వం తరతరాలకు స్ఫూర్తి
- ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కేశని యాదయ్య



**కడ్తాల్ అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** పేద ప్రజల పక్షాన నిలిచి,ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన ప్రజా వీరుడు పండుగల సాయన్న ముదిరాజ్ 174వ జయంతి ఉత్సవాలను కడ్తాల్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగల సాయన్న చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కేశని యాదయ్య మాట్లాడుతూ..పండుగల సాయన్న వీరత్వం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన ప్రదర్శించిన ఆత్మగౌరవం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. పేద ప్రజల కోసం ఆయన సాగించిన పోరాటం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ధైర్యం, తెగువ, ప్రజల పట్ల నిబద్ధత వంటి విలువలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా వీరుడు పండుగల సాయన్న ఆశయాలను కొనసాగిస్తూ, సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేష్,బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కేశని మహేష్(హెచ్ఆర్),మత్స్యకార సంఘం వైస్ ప్రెసిడెంట్ చెన్నామోని శేఖర్, కోశాధికారి బోల్ల సత్యనారాయణ,సంఘం సభ్యులు మూడ నర్సింహ,మూఢ రవి, పిడుగు వెంకటేష్, శివ,మూడ వెంకటేష్,నాయకులు లాయక్ అలీ,క్యామ వెంకటేష్,అమృతం పాండు,సిద్దిగారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ కోటాలో భర్తీ చేసే నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలి

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**మిర్యాలగూడ అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్రంలో మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడం ద్వారా వారి సేవలను స్మరించుకోవడం అభినందనీయమని, అయితే బీసీలకు రాజకీయ అధికారంలో తగిన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీలకు రాజకీయ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు కేవలం మహనీయుల విగ్రహాలు, జయంతి ఉత్సవాలకే పరిమితం కాకుండా, పాలనలోనూ నిర్ణయాధికారం లోనూ సముచితమైన భాగస్వామ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో 50 శాతం బీసీలకు కేటాయించాలి. బీసీల జనాభా దామాషా, సామాజిక న్యాయం ప్రాతిపదికన నామినేటెడ్ పదవుల్లో తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా త్వరలో భర్తీ చేయనున్న గవర్నర్ కోటా నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో ఇద్దరు బీసీ నాయకులకు అవకాశం కల్పించి,బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహణ

- నీటి వనరుల సంరక్షణ, ఉపాధి హామీ పనులపై గ్రామస్తులకు అవగాహన



**ఆత్మకూరు అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎలినినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే సాగునీరు, తాగునీరు, విద్యుత్ సమస్యలను అధిగమించడంతో పాటు గ్రామీణ కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆత్మకూరు మండలంలోని తుక్కాపురం, కూరెళ్ల, పుల్లాయిగూడెం గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలినినో ప్రభావం వల్ల తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై గ్రామస్తులతో ఎంపీడీవో రాములు నాయక్ చర్చించారు. నీటి వనరుల సంరక్షణ, నీటి కొరత నివారణ, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించడం వంటి అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ గ్రామసభల్లో ఎంపీవో శ్యామ్ కుమార్, ఏఈ మెహర్ సాయి, ఏపీవో రమేష్, ఆయా గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పింగల్ అన్న సేవాదల్ ఆధ్వర్యంలో ఘనంగా గోలి పింగల్ రెడ్డి జన్మదిన వేడుకలు

- ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలిచే నాయకుడు గోలి పింగల్ రెడ్డి
- అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మధ్య ఘనంగా వేడుకలు



**బీబీనగర్, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి జన్మదిన వేడుకలను పింగల్ అన్న సేవాదల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..** గోలి పింగల్ రెడ్డి నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తూ, ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ, మంచి చెడుల్లోనూ, కష్టనష్టాల్లోనూ తనను నమ్ముకున్న వారికి అండగా నిలిచే వ్యక్తిత్వం ఆయన సొంతమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై, సేవా భావంతో ముందుకు సాగుతున్న గోలి పింగల్ రెడ్డికి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరుకుంటూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని అభిమానులు, నాయకులు మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పింగల్ అన్న సేవాదల్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించాలి..



- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జాగ్రత్త తీసుకోవాలి..
- జిల్లాలోని నీటి వనరులపై తక్షణమే ఆడిట్ నిర్వహించండి..
- నివేదికలు సమర్పించాలి : జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్గొండ, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** నల్గొండ ఎల్‌నినో ప్రభావం కారణంగా రాబోయే రోజుల్లో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించుకోవడంతోపాటు, నీటి సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని గ్రామాలు, మండలాలు, మున్సిపల్ ప్రాంతాల్లో ఉన్న నీటి వనరులు, నీటి నిల్వలపై తక్షణమే ఆడిట్ నిర్వహించి సమగ్ర నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులతో పాటు శాస్త్రవేత్తలతో భవిష్యత్తులో తాగునీటి పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం, జిల్లాలో నీటి లభ్యత, భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులు, నీటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సతీష్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం తాగునీరు, సాగు నీరు, విద్యుత్, వ్యవసాయం తదితర రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వివరించారు.

ప్రస్తుతం అందు బాటులో ఉన్న నీటి వనరులను సమర్థ వంతంగా వినియోగించుకోవడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం, అవసరాలకు అనుగుణంగా నీటి వినియోగాన్ని నియం త్రించడం ద్వారా నీటి సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. నీటిని వృథా చేయకుండా పొదుపు చేయడం, నీటి సంరక్షణ చర్యలను విస్తృ తంగా చేపట్టడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.



**అనంతరం జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ..** జిల్లాలోని ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ, రాబోయే రోజుల్లో నీటి మట్టాలు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, నీటి వినియోగాన్ని పర్యవేక్షిస్తూ సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామం, మండలం, మున్సిపల్ ప్రాంతంలో ప్రస్తుతం అందుబాటు లో ఉన్న నీటి వనరులు, వాటిలో ఉన్న నీటి నిల్వల వివరాలను తక్షణమే సేకరించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రాబోయే వానాకాలం వరకు నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని, నీటిని నిర్లక్ష్యంగా వృథా చేస్తే భవిష్యత్తులో తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ప్రజలకు స్పష్టంగా వివరించాలని తెలిపారు.

ప్రతి గ్రామానికి, ప్రతి ఒక్కరికీ నీటి సంరక్షణ సందేశం చేరాలి అని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారి సమన్వయంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతి గ్రామంలోని నీటి వనరులన్నింటిపై ఆడిట్ నిర్వహించి సమగ్ర నివేదికలు అందించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా పైప్‌లైన్లలో ఎక్కడా లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, నీటి వృథాను పూర్తిగా నివారించేలా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. నీటి వృథా లేని గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి వాటిని నీటి వృథా లేని గ్రామాలు, జోన్లుగా ప్రకటించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నీటి లభ్యత, వినియోగం, సరఫరా వ్యవస్థలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు, డీపీఓ తరుణ్ చక్రవర్తి తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కొమరంభీం, పండుగ సాయన్నల పోరాటం అసామాన్యం..

- వారి స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం
- సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాటం..
- అణగారిన వర్గాల హక్కుల సాధనకు వారి కృషి స్ఫూర్తిదాయకం..
- తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి..



**హైదరాబాద్, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** కొమురం భీం, పండుగ సాయన్న ముదిరాజ్‌లు సాగించిన పోరాటాలు, వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం చేసిన కృషి భావితరాలకు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.

సమాజంలో సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం నెలకొల్పేందుకు మహనీయులు చేసిన పోరాటాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన పేర్కొన్నారు. కొమురం భీం, పండుగ సాయన్న ముదిరాజ్‌లు తమ కాలంలో ఎదురైన అన్యాయాలను, అణచివేతను ధైర్యంగా ఎదుర్కొని ప్రజల హక్కుల కోసం పోరాడారని తెలిపారు.

వారి జీవితాలు, పోరాటాలు ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తాయని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం, ప్రజల ఆత్మగౌరవం కోసం కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయడం, వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత వారి పోరాట పటిమను, ధైర్యాన్ని, సమాజం పట్ల ఉన్న బాధ్యతను ఆదర్శంగా తీసుకుని న్యాయబద్ధమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కొమురం భీం, పండుగ సాయన్న ముదిరాజ్‌లు ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి తరతరాలకు ప్రేరణగా నిలుస్తుందని, వారు ఆశించిన సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు సమాజం నిరంతరం కృషి చేయాలని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## ఫామ్‌హౌస్‌లకు నీళ్లు.. రైతులకు కన్నీళ్లా?

- కాళేశ్వరం పేరుతో వేల కోట్లు ఖర్చు చేసి.. రైతులకు సాగునీటి కష్టాలు మిగిల్చారా?
- ప్రాజెక్టులు ప్రజల కోసమా? వ్యక్తిగత ప్రయోజనాల కోసమా? గత పాలకులు సమాధానం చెప్పాలి
- బీఆర్ఎస్‌పై దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి నిప్పులు!

**మహబూబ్‌నగర్, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో భారీగా ప్రజాధనం ఖర్చు చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, నీటి పంపిణీపై నేటికీ ప్రశ్నలు తలెత్తుతుండటంపై దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పేరుతో వేల కోట్లు ఖర్చు చేసినా రైతులకు సాగునీటి కష్టాలు ఎందుకు తప్పడం లేదని బీఆర్ఎస్ నాయకత్వాన్ని ఆయన నిలదీశారు. రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి, ప్రాజెక్టులను రాజకీయ ప్రచారానికి పరిమితం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కొండ పోచమ్మ సాగర్ నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటిని మళ్లించారంటూ వస్తున్న ఆరోపణలపై గత పాలకులు



ప్రజలకు వాస్త వాలతో కూడిన సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాధనంతో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల వినియోగం, నీటి పంపిణీపై పూర్తి పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణం.. ప్రచార ఆర్భాటం మాత్రమే అభివృద్ధి కాదు! చివరి ఎకరా వరకు సాగునీరు అందినప్పుడే రైతులకు నిజమైన ప్రయోజనం చేకూరుతుంది అని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి వనరుల నిర్వహణ, నీటి పంపిణీపై సమగ్ర సమీక్ష జరగాలని, రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి వినియోగం ఎందుకు జరగలేదు అని బీఆర్ఎస్ నాయకత్వాన్ని డిమాండ్ చేశారు.

## నాణ్యతతో పనులు త్వరగా పూర్తి చేయాలి..

- ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ములుగులో ఆధునిక బస్టాండ్ పనుల పరిశీలన



**ఏటూరునాగారం, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మోడల్ బస్‌స్టాండ్ పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రయాణికుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్గడే హేమంత్ సహదేవరావుతో కలిసి ములుగు జిల్లా కేంద్రంలోని మోడల్ బస్‌స్టాండ్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఫ్లోరింగ్, నిర్మాణ పనులతో పాటు ఇతర పనుల పురోగతిని పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. **ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..** ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. పనుల వేగంతో పాటు నాణ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని, తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సదుపాయాలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. త్వరగా బస్‌స్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సంబధిత అధికారులు, పాల్గొన్నారు.

### గ్రాడ్యుయేట్‌లు ఓటర్లుగా
## నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**కంటోన్మెంట్, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రాడ్యుయేట్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్‌లు ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ వరకు గ్రాడ్యుయేట్ లు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మీ మీ ప్రాంతాలలో అర్హులైన గ్రాడ్యుయేట్‌లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేపించాలని కోరారు. వాస్తవంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ నిర్వహించాల్సి ఉండగా, బాధ్యతగా వ్యవహరించడం లేదని పేర్కొన్నారు. కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా గ్రాడ్యుయేట్‌లు ఉన్న ప్రతి ప్రాంతంలో గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన



కల్పించాలని కోరారు. బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించిన నాయకులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ లు నామన శేషకుమారి, కుర్మ హేమలత, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నాయకులు టి. శ్రీహరి, కిషోర్ సురేష్ గౌడ్,ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, గందే నాగులు, రాములు, నరేందర్, శేఖర్, ఖలీల్, వెంకటరమణ, కోటేశ్వర్ గౌడ్, ప్రేమ్, బాసా లక్ష్మీ, నాగలక్ష్మి, దుర్గ, రాణి కౌర్ పాల్గొన్నారు.

## పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** పండుగ సాయన్న 174వ జయంతి సందర్భంగా గురువారం మహబూబ్‌నగర్‌లోని పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఆనాటి నిజాం ప్రభుత్వ హయాంలో భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన యోధుడు పండుగ సాయన్న అని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు అండగా నిలిచి, వారి హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న బడుగు బలహీన వర్గాల తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ఆయన జీవితం ధైర్యానికి, సామాజిక న్యాయానికి, పేదల పట్ల నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని, సామాజిక స్పృహను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ. నిర్మల, బీసీ సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రికి
## స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్



**కొడంగల్ అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** కొడంగల్ పర్యటన సందర్భంగా విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డినీ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక పూల బొకే అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. గురువారం కొడంగల్ కు విచ్చేసిన ముఖ్యమంత్రికి హెలిపాడ్ దగ్గర జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులు ఆహ్వానం పలికారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి విజయదశమి పర్వదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

## వెట్టిచాకిరీ నిర్మూలనకు 'స్వేచ్ఛా రథం'..

- జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్..

**కామారెడ్డి, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లోవిస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్సంగ్వాన్ అధికారులను ఆదేశిం చారు. వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కుల పరి రక్షణ, బాధితులకు అందించే సహాయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ.. వెట్టిచాకిరీ నిరోధక చట్టం అమల్లో ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి, బాధితులను గుర్తించి రక్షించడంతో పాటు వారికి అవసరమైన పునరావాసంప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించి, వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించే స్వేచ్ఛా రథం ద్వారా అసంఘటిత కార్మికులు, వెట్టిచాకిరీకి గురయ్యే ప్రమాదం ఉన్న వర్గాలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు,



చేపలు, రొయ్యల పెంపకం, గనులు, క్వారీల వంటి రంగాల్లో పనిచేసే కార్మికులకు వెట్టిచాకిరీ దుష్పరిణామాలు, కార్మిక హక్కులు, ఫిర్యాదుల నమోదు విధానాలపై అవగాహన కల్పించనున్నారు. టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చువెట్టిచాకిరీకి గురైనవారు లేదా అలాంటి ఘటనల గురించి తెలిసినవారు 080-69434343 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, అంతర్జాతీయ న్యాయ సహాయ సంస్థ ప్రతినిధి ఆనంద్ కుమార్‌తో పాటు కార్మిక శాఖ, పోలీసు శాఖ, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, జిల్లా న్యాయ సేవల సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిపెట్టాలి

- తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలు
- రైతు వేదిక నుంచి పాల్గొన్న మార్కెట్ చైర్మన్ యాట గీత నరసింహ

**కడ్తాల్ అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశమున్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకొని, అందుకు అనుగుణంగా పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండల పరిధిలోని రాంనుంతల రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి వ్యవసాయ రంగ



పరిస్థితులు, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు, రైతులకు దిశానిర్దేశం చేశారు.తక్కువ కాలపరిమితి కలిగిన పంటలతో పాటు కంది, పెసర, జొన్న వంటి తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూసార పరిరక్షణ,నేల ఆరోగ్యం, పంటల సంరక్షణ, నీటి పొదుపు పద్ధతులపై 'ఖేత్ బచావో అభియాన్' ద్వారా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ, పంట నష్టాలను తగ్గించుకునేలా రైతులు ప్రణాళికాబద్ధంగా సాగు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా పత్తి కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తిలో తేమ శాతాన్ని నియంత్రిస్తూ,మలినాలు లేకుండా నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకురావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

**రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలి..**

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మార్కెట్ చైర్మన్ యాట గీత మాట్లాడుతూ.. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాల ని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అందించే సలహాలు, సూచనలను పాటిస్తూ తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యమివ్వాలని, తద్వారా పంట నష్టాలను తగ్గించుకునేందుకు కృషి చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓలు మీనాక్షి, నికిత, వినోద్, దేవర శెట్టి మహేష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఎం.ఎల్.సి. ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలి : డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల

- ఎం.ఎల్.సి. ఓటర్లను నమోదు చేయించేలా కృషి చేయాలి
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తం కావాలి : ఖమ్మం ఎం.పి. రఘురాంరెడ్డిని, ఎం.ఎల్.సి. అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డిని సన్మానించిన కొత్వాల





**ఖమ్మం, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఎం.ఎల్.సి. ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి గెలుపుకు కృషి చేయాలని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కొత్తగూడెంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఎం.ఎల్.సి ఎన్నికల సమయాత్త సమావేశం ఏర్పాటుచేశారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, వరంగల్-నల్గొండ-ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, డిసిసి అధ్యక్షురాలు తోటదేవి ప్రసన్న ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 75 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఎం.ఎల్.సి ఎన్నికలకు గాను కాంగ్రెస్ కార్యకర్తలు ఓటర్ల నమోదులో చురుగ్గా పాల్గొనాలని కొత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో 60 ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం : ప్రిన్సిపాల్ డా. శంకర్

**ఖమ్మం, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 60 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్ ఐసియు) - 2, కార్పెంటర్ - 1, బార్బర్ - 3, క్యాటలాగర్ (సెంట్రల్ రికార్డ్స్) - 1, డేటా ఎంట్రీ ఆపరేటర్ - 20, ఎలక్ట్రీషియన్ - 3, ప్లంబర్ - 1, రికార్డు క్లర్క్/రికార్డు అసిస్టెంట్ - 1, రిఫ్రాక్షనిస్ట్/ఆప్టీషియన్ - 1, టైలర్ - 1, ధోబీ - 2, గ్యాస్ ఆపరేటర్ - 2, ల్యాబ్ అటెండెంట్ - 7, ఆఫీస్ సబోర్డినేట్ - 8, ఎంఎన్ఓ/ఎఫ్ఎన్ఓ - 2, అటెండెంట్ - 4, మ్యూజియం అసిస్టెంట్ కమ్ ఆర్టిస్ట్ - 1 పోస్టులు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 31, 2026 సాయంత్రం 5:00 గంటలలోపు ఆఫ్ లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. అభ్యర్థుల విద్యా అర్హతలు, నిబంధనలు మరియు ఇతర పూర్తి సమాచారం కోసం ఖమ్మం జిల్లా అధికారిక వెబ్ సైట్ https ://khammam.telangana. gov.in లేదా వైద్య కళాశాల వెబ్ సైట్ https://gmckhammam.org లను సందర్శించాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కి విశేష స్పందన : కాంగ్రెస్ నేత నూతి



**ఖమ్మం, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :**
జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. గురువారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ జిల్లా లోని ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామని ఫిర్యాదీదారులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో 48వ జూనియర్ బాలికల అంతర్ జిల్లా హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోస్టర్ తుమ్మల చే ఆవిష్కరణ



**ఖమ్మం, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఖమ్మం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 48వ జూనియర్ బాలికల అంతర్ జిల్లా హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్–2026 పోస్టర్‌ను తుమ్మల క్యాంప్ ఆఫీస్ లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తుమ్మల యుగేందర్ ఆవిష్కరించారు.ఈ పోటీలు అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2, 2026 వరకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ (డివైఎస్ఓ), తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సహకారంతో ఈ ఛాంపియన్‌షిప్ జరగనుంది.ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ క్రీడాకారిణులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి అవకాశం లభించనుంది. పోటీల విజయవంతమైన నిర్వహణకు ఖమ్మం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వర రావు, ఖాదర్ బాబు , హనుమంత్ రావు, కృష్ణ మోహన్ తదితర కాంగ్రెస్ నాయకులు, ఖమ్మం జిల్లా హ్యాండ్బాల్ జనరల్ సెక్రెటరీ వరికూటి మోహన్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# జూనియర్ బాలికల జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



**ఖమ్మం, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :**
నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న 48వ జూనియర్ బాలికల జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్–2026 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా పోస్టర్ ను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు భీమనాదుల అశోక్ రెడ్డి, సెక్రటరీ వరికూటి మోహన్, కోశాధికారి కోపిల తంబి, చీఫ్ ప్యాట్ర న్ వేముల ఆది, నాయకులు లింగాల రవికుమార్, కాంగ్రెస్ పార్టీ తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు కొప్పుల అశోక్, నాయకులు యువ గోపి, సంఘం ప్రతినిధులు, క్రీడా నిర్వాహకులు,క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# సుంకర వాసును పరామర్శించిన కనకం



**ఖమ్మం, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** సత్తుపల్లి మున్నూరు కాపు సీనియర్ నాయకులు సుంకర శ్రీనివాసరావు ( వాసు ) ను పరామర్శించిన మున్నూరు కాపు ట్రస్టు బోర్డు అధ్యక్ష, కార్యదర్శులు కనకం జనార్ధనరావు, కనిశెట్టి నర్సయ్య, మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు, రాష్ట్ర కార్యదర్శి గోవింద్ శ్రీనివాస్ రావు, సత్తుపల్లి మున్నూరు కాపు నాయకులు నల్లాకుల సూరిబాబు బత్తుల పవన్ కుమార్, చంటి నాయుడు తదితరులు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కాలు ఫ్రాక్చర్ అయ్యి రెస్ట్ తీసుకుంటున్న సుంకర వాసును వారి ఇంటి వద్ద కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# ఎంఎల్సీ ఎన్నికలలో సత్తా చాటాలి : రాయల నాగేశ్వరరావు




**ఖమ్మం, అక్టోబరు 23 (జర్నలిస్ట్ ఫైల్):** ఎంఎల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థిని గెలిపించి సత్తా చాటాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఛైర్మెన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలో మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఖమ్మం-నల్గొండ- వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గురించి రఘునాథపాలెం మండల పార్టీ పత్రికా సమావేశం జరిగింది. అందులో ఖమ్మం నియోజకవర్గం ఇన్చార్జి రాయల నాగేశ్వరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తుమ్మల యుగేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రతి గ్రామంలో ఉన్న పట్టభద్రులను ఓటర్ ఎన్రోల్మెంట్ చేయుటకు ఆ గ్రామంలో ఉన్న సర్పంచ్లు,ఆ గ్రామశాఖ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అందరూ పాల్గొని ప్రతి ఒక్క ఓటర్ని విజయవంతంగా ఎన్రోల్మెంట్ పూర్తి చేయాలని కోరుకుంటూ ఈ కార్యక్రమం మొత్తాన్ని నవంబర్ ఒకటో తారీకు వరకు విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ అదేవిధంగా మండలంలో ఒక ఆరు ఎన్రోల్మెంట్ సెంటర్లను పెట్టడం జరిగింది. వి వెంకటాయపాలెం, రఘునాథపాలెం ఆపిల్ సెంటర్, మంచుకొండ సెంటర్, కోయచేలక, ఈర్లపూడి, రఘునాథపాలెం ఎంపీడీవో ఆఫీస్ ఇలా 6 సెంటర్లు మన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని విజయవంతంగా ఎన్రోల్మెంట్ పూర్తి చేసి వచ్చే ఎలక్షన్లో వారిని గెలిపించి మన కాంగ్రెస్ పార్టీ యొక్క సత్తా ఏంటో చూపించి మన కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని మన కాంగ్రెస్ కుటుంబ సభ్యులందరూ ఈ ఎలక్షన్ ని చాలా చాలెంజ్ గా తీసుకొని రెండు ఎమ్మెల్సీలను గెలిపించి మన ప్రభుత్వానికి కానుక ఇవ్వాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ ఖాదర్ బాబా, వి వెంకటయ్య పాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదా బాబు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు నల్లమల్ల ఆనంద్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎరగర్ల హనుమంతరావు, రఘునాథపాలెం మండల అధ్యక్షులు కెలోత్ దేవ్ సింగ్, కొంటెముక్కల నాగేశ్వరరావు, పువ్వాడ ఉదయ్ నగర్ సర్పంచ్ సిద్దయ్య, సూర్య తండ సర్పంచ్ భూక్యా సక్రి మంగీలాల్ ,కోర్లబోడు సర్పంచ్ భూక్యా చిన్నయ్య నాయక్,పరకల బొడుతండా గ్రామ అధ్యక్షులు ధరావత్ రామ్మూర్తి నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ కోటేష్ నాయక్, జరపల శీను,పాలపు సత్యనారాయణ, చల్లగుండ్ల శ్రీనివాసరావు,షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది సంక్షేమమే ప్రాధాన్యం



**గుంటూరు, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్):** పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డేలో సిబ్బంది నుంచి బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు, ఇతర సేవా సంబంధిత సమస్యలపై వినతులు స్వీకరించారు.

ప్రతి వినతిని పరిశీలించిన ఎస్పీ, నిబంధనల మేరకు సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది సమస్యలు సకాలంలో పరిష్కారమైతే విధి నిర్వహణలో సామర్థ్యం, నిబద్ధత, ఉత్సాహం పెరుగుతాయని పేర్కొన్నారు.

పోలీస్ సిబ్బంది ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, అంకితభావంతో పనిచేస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని కోరారు.

## మాజీ ఎమ్మెల్యే మద్దాలి గిరితో లక్ష్మీ అపర్ణ మర్యాదపూర్వక భేటీ



**గుంటూరు, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే మద్దాలి గిరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి, ఎన్నికల ప్రచారంపై చర్చించారు.

తనకు, కూటమి అభ్యర్థులకు ఆర్యవైశ్య నాయకులు, సమాజం నుంచి మద్దతు అందించాలని లక్ష్మీ అపర్ణ కోరారు. దీనిపై మద్దాలి గిరి సానుకూలంగా స్పందిస్తూ తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ గుంటూరు నగర సమగ్ర అభివృద్ధికి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆర్యవైశ్య సమాజాన్ని కోరారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

కార్యక్రమంలో అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నేరెళ్ల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాపారావు చింతపండు కాశీ, నిరంజన్, ఈరంటి వరప్రసాద్ (బస్ బాబు) తదితర ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయం నూతన భవన ప్రారంభోత్సవం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలో శుక్రవారం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఘనంగా ప్రారంభించడం జరిగింది .

ఈ సంస్థ యొక్క ప్రధాన కర్తవ్యం ప్రపంచమంతా ధర్మస్థాపన శాంతి స్థాపన చేయడం ధర్మస్థాపన కోసం మానవుల్లో మార్పు రావాలి ఆ మార్పు కోసమే పరంపిత పరమాత్మ సహజ రాజయోగ ద్వారా మనుషుల్లో మార్పు తేవాలని అటువంటి మార్పు కోసం బ్రహ్మంగారి మఠంలో బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో రాజయోగశిక్షణ కోసం మెడిటేషన్ కోసం నూతన భవనాన్ని ప్రారంభించడం జరిగింది దీని ప్రధాన ఉద్దేశం ఏమిటంటే ప్రజల్లో మానసిక శాంతి కోసం ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా నేర్పించబడును కనుక బ్రహ్మంగారి మఠం మండలంలోని ప్రజలందరూ రాజయోగ ధ్యాన కేంద్రం ను విచ్చేసి ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజయోగి బ్రహ్మ కుమార్ రాధాకృష్ణ స్వామి అనంత ఆనందగిరి బ్రహ్మకుమారి స్వప్న భాగ్య మల్లిక తెలిపారు.

## మండల వ్యాప్తంగా 11 ఎంపీటీసీ స్థానాలకి 56 నామినేషన్లు దాఖలు

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలకు 56 నామినేషన్ దాఖలు అయ్యాయి అందులో టీడీపీ తరఫున 51 సిపిఐ(ఎం ) తరపున 2 వైసీపీ 1 జనసేన తరపున 1 గా దరఖాస్తు చేసుకోవడం జరిగింది అని రిటర్నింగ్ అధికారి నాగయ్య తెలిపారు

# కూటమికి ఓటు.. అభివృద్ధికి రూటు

- గుంటూరు నగరాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్ చేస్తాం
- తూర్పులో రూ.400 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం
- విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట
- మురుగు శాశ్వత పరిష్కారానికి చర్యలు
- కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి
- 75, 76 డివిజన్లలో ఎమ్మెల్యే నసీర్, మేయర్ అభ్యర్థి లక్ష్మీఅపర్ణ ఎన్నికల ప్రచారం



**గుంటూరు, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేయడం గుంటూరు నగర అభివృద్ధికి బాటలు పరచడమేనని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక 75, 76 డివిజన్లలో నగర మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, కార్పొరేటర్ అభ్యర్థులు ఏల్చూరి నాగక్రాంతి, అంకం మాలినితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి డివిజన్ లోనూ ప్రజలు కూటమి నేతలకు బ్రహ్మరథం పట్టారు. రెండున్నరేళ్లలో అన్ని వర్గాలకు మేలు జరగడంతో అభివృద్ధిని కొనసాగించేందుకు కూటమి నేతలకు తాము మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే ఆర్థిక సంఘ నిధులు మంజూరవుతాయని, తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని, దీనికి అడ్డుకునేందుకు గొడ్డలి కుయుక్తులు పన్నుతోందని ఎమ్మెల్యే నసీర్ మండిపడ్డారు.

రాష్ట్రంలో త్వరలో నూతన పింఛన్లు మంజూరు చేయబోతున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించబోతున్నామని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి బలం చేకూర్చడం ద్వారా గుంటూరు నగరంలో మరింత అభివృద్ధి సాధించుకోవచ్చన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అన్ని రంగాల్లో ప్రగతి సాధించామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి సుమారు రూ.350 కోట్లు వెచ్చించామన్నారు. మురుగు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. అంతర్గత రోడ్లను సైతం సీసీలుగా తీర్చిదిద్దుతున్నామని, గత వైసీపీలో గుంతల రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. కేవలం రోడ్లనే కాకుండా పార్కులు, క్రీడా ప్రాంగణాలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తున్నాయని, తద్వారా యువతకు ఉద్యోవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా సంస్కరణలకు నాంది పలికారని, గత పదో తరగతి ఫలితాల్లో స్పష్టంగా తెలిసిందన్నారు. నియోజకవర్గంలో నలుమూలలుగా అభివృద్ధికి పునాదులు వేశామని, దీనిని మరింత కొనసాగించాలంటే కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు చిట్టా బత్తిని చిట్టిబాబు, ఏల్చూరు కిరణ్, కొల్లా శ్రీను, పుట్టా దుర్గ, జంపరాల శ్రీను, బాబు, నన్నపనేని వేణుబాబు, గద్దం రోశయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సి.ఎస్.పురం జడ్పీటీసీ అభ్యర్థిగా కోటపాటి జనార్దన్‌రావు నామినేషన్



**కనిగిరి, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్):** మార్కాపురం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని సి.ఎస్.పురం మండల కూటమి జడ్పీటీసీ అభ్యర్థిగా కోటపాటి జనార్దన్‌రావు శుక్రవారం మార్కాపురం జిల్లా కేంద్రంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు.

కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి, పీసీ పల్లి మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గద్దం బాలసుబ్బయ్య, తలకొండపాడు వెంకటేశ్వర్లు, కనిగిరి ఏఎంసీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, మోపాడు టీడీపీ నాయకుడు గుర్రం వెంకటేశ్వర్లు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలాగే కనిగిరి కూటమి జడ్పీటీసీ అభ్యర్థి దంతులూరి ప్రకాశం, బైరెడ్డి జస్వంత్‌రెడ్డి, గళ్ల చెన్నయ్య, పోలు సుధాకర్‌రెడ్డి, మేడసాని రమణయ్య, తిరుపతిరావు, తిరివీధి చంద్ర, కోటపాటి వెంకటేశ్వర్లు, యరశింగ్ రాయుడు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కోటపాటి జనార్దన్‌రావుకు మద్దతు తెలిపారు.

## రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి : ప్రభుత్వ విప్ బొండా ఉమ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర అభివృద్ధిని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడమే వైసీపీ అధినేత జగన్ ఏకైక అజెండా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే జగన్ 'క్రిమినల్ లిటిగెంట్'గా మారి, న్యాయస్థానాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను నిలిపివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

స్థానిక సంస్థలకు 16వ ఆర్థిక సంఘం నుంచి అందాల్సిన సుమారు రూ. 12,500కోట్ల నిధులను రాకుండా చేయడమే జగన్ కుట్ర అని బొండా ఉమ మండిపడ్డారు. "నేడు ఎన్నికలు జరిగితే వైసీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయం. అందుకే నామినేషన్ల ప్రక్రియ మొదలైన నాటి నుంచే దౌర్జన్యాలకు తెరలేపారు. పుంగనూరు, తిరుపతి, నగరి, రాయచోటి వంటి ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టడం, రాళ్లు, కర్రలతో దాడులు చేయడం వంటి అరాచకాలకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఆధారాలు కూడా స్పష్టంగా ఉన్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ బెదిరింపులు, కిడ్నాపులు, హత్యాయత్నాలతో 24 శాతం స్థానాలను బలవంతంగా ఏకగ్రీవం చేసుకుందని బొండా ఉమ గుర్తుచేశారు. "పుంగనూరులో 85 స్థానాలకు గానూ 84, మాచర్లలో 77 స్థానాలకు గానూ 74 స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న నీచ చరిత్ర జగన్‌ది. 2014లో చంద్రబాబు హయాంలో కేవలం 1 శాతం మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. దొంగే దొంగ అన్నట్లుగా, తను చేసిన అరాచకాలను ఇతరులపై నెట్టే ప్రయత్నం జగన్ చేస్తున్నారు" అని విమర్శించారు.

సొంత బాబాయిని హత్య చేయించి, 'నారాసుర రక్తచరిత్ర' పేరిట దుష్ప్రచారం చేసిన వ్యక్తి జగన్ అని, గతంలో ఇచ్చిన హామీల్లో 85 శాతం అమలు చేయకుండా ఇప్పుడు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ 27 నెలల్లో రూ. 1,60,000 కోట్లను సంక్షేమానికి ఖర్చు చేస్తూ, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో పరాజయం తప్పదనే భయంతోనే జగన్ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, 2024లోనే వైసీపీ పతనం ప్రారంభమైందని, స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగితే ఆ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని బొండా ఉమ జోస్యం చెప్పారు.

## బ్రహ్మంగారిమఠం మండల జడ్పిటిసి అభ్యర్థిగా ముండ్లపాటి చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆశీస్సులతో ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో శుక్రవారం కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో బ్రహ్మంగారిమఠం మండల జడ్పిటిసి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం జరిగింది యువకులు విద్యావంతులు బ్రహ్మంగారిమఠం మండల ప్రజలు ఓటరు మహాసేయులు అందరూ సహకరించి గెలిపిస్తే ఎమ్మెల్యే ఆశీర్వచనాలు అండదండలతో బ్రహ్మంగారిమఠం మండల నాయకుల సహాయ సహకారాలతో బ్రహ్మంగారిమఠం మండలాన్ని అభివృద్ధి చేసి ప్రగతి పథంలో నడిపించడానికి నా వంతు కృషి చేస్తానని వారు తెలిపారు జడ్పిటిసి అంటే జిల్లా పరిషత్ లో మన మండల సమస్యలు ప్రస్తావించి మన మండలంలో ఉన్న సమస్యలను జిల్లా పరిషత్ లో మాట్లాడి వాటిని పరిష్కరించుటకు చట్టం చేసే విధంగా చర్యలు తీసుకునే విధంగా మాట్లాడగలిగే వ్యక్తికి మీరు అవకాశం ఇస్తారని మీ బిడ్డగా మీ ఆశీర్వచనాలను కోరుకుంటున్నాను ఒక్కసారి విద్యావంతుడిగా మంచి చేసే వ్యక్తిగా నాకు అవకాశం ఇవ్వండి బ్రహ్మంగారి మఠం మండలాన్ని ఎమ్మెల్యే మన నాయకులు కలలు కన్న విధంగా అభివృద్ధి చేద్దాం.

## సొంత కుటుంబానికే న్యాయం చేయలేని జగన్.. మహిళలకు ఏం న్యాయం చేస్తారు?



**గుంటూరు, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యం అంటే ప్రసంగాలు, ప్రెస్‌మీట్లు కాదని, ప్రతికూల పరిస్థితుల్లో సంయమనం, పరిణతితో వ్యవహరించడమే నాయకత్వ లక్షణమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో జగన్ చేస్తున్న వ్యాఖ్యలు విరుద్ధంగా ఉన్నాయని అన్నారు.

మహిళల హక్కులు, ఆత్మగౌరవం గురించి మాట్లాడే జగన్ తన కుటుంబ సభ్యుల విషయంలో వ్యవహరిస్తున్న తీరుపై ప్రజల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయని గళ్ళా మాధవి పేర్కొన్నారు. కుటుంబ విభేదాలు ఉన్నప్పటికీ శుభకార్యాల్లో బంధాలను గౌరవించడం తెలుగు, భారతీయ సంప్రదాయమని, మేనకోడలి వివాహ సమయంలో మేనమామగా ఆశీర్వదించాల్సిన బాధ్యత ఉందన్నారు.

జగన్ కుటుంబ వ్యవహారాలపై పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు కూడా సమంజసం కాదని ఆమె విమర్శించారు. కుటుంబ సభ్యుల పట్ల వ్యవహరించే తీరుపై వైసీపీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

మహిళలను కించపరిచే వ్యాఖ్యలు ఎవరూ చేసినా ఆ పార్టీ మహిళా నేతలు ప్రశ్నించాలని, పార్టీ ప్రయోజనాల కోసం మహిళల ఆత్మగౌరవాన్ని పక్కన పెట్టడం సరికాదన్నారు.

రాజకీయ పదవులు, అధికారం శాశ్వతం కాదని, వ్యక్తిత్వం, కుటుంబ బంధాల పట్ల గౌరవం, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే నిబద్ధతే నాయకుడి విలువను నిర్ణయిస్తాయని గళ్ళా మాధవి అన్నారు. కూటమి ప్రభుత్వం ఐకమత్యంతో రాష్ట్ర అభివృద్ధికి పనిచేస్తుంటే వైసీపీ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని ఆమె విమర్శించారు. ప్రజాస్వామ్యం, మహిళల హక్కుల గురించి మాట్లాడే ముందు మాటలకు అనుగుణంగా వ్యవహరించాలని జగన్‌కు సూచించారు.

## మంగళగిరిలో 156 మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఈ నెల 11వ తేదీన నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన 156 మందికి శుక్రవారం ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. మంగళగిరిలోని శ్రీమతి నన్నపనేని లక్ష్మి కళ్యాణమండపం (వైష్ణవి)లో జరిగిన ఈ కార్యక్రమంలో నన్నపనేని బాపనయ్య, సీతారావమ్మ, లక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నన్నపనేని నాగేశ్వరరావు కళ్లజోళ్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కరోనా సమయంలో వ్యాక్సిన్ తీసుకున్నవారు గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవడం మంచిదని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించడం, ప్రమాద నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మంగళగిరిలోని నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి అగ్నిమాపక కార్యాలయంలో ఫైర్ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిమాపక శాఖ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక పరికరాల వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన భద్రతా నియమాలను అగ్నిమాపక సిబ్బంది ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సిబ్బంది సమాధానాలిస్తూ అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాద సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించడంపై అవగాహన కల్పించారు. పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సులో విద్యార్థులు అగ్నిమాపక కార్యాలయానికి చేరుకుని కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ధైర్యం, అప్రమత్తత, భద్రతా స్పృహ పెంపొందించేందుకు అవకాశం కలిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆర్‌అండ్‌డీ ప్రతినిధి మారియా ప్యాట్రిక్, ఏజీఎం రమేష్ రెడ్డి, కోఆర్డినేటర్ జయశ్రీ, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసన్నాంజనేయులు, ఏఓ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థుల విజయంతోనే క్షేత్రస్థాయి అభివృద్ధి సాధ్యం: మంత్రి దుర్గేష్

- 22వ వార్డు జనసేన అభ్యర్థి పుల్లేటికుర్తి వెంకటేష్ తరఫున ముమ్మర ప్రచారం
- స్లాటర్ హౌస్ తరలింపు, షాదీఖానాల ఏర్పాటుపై సానుకూలంగా స్పందించిన మంత్రి దుర్గేష్



**నిడదవోలు, అక్టోబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్)::** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తేనే క్షేత్రస్థాయిలో వార్డుల వారీగా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

శుక్రవారం నిడదవోలు పట్టణంలోని 22వ వార్డులో కూటమి జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న పుల్లేటికుర్తి వెంకటేష్ విజయాన్ని కాంక్షిస్తూ మంత్రి దుర్గేష్ విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సందర్భంగా నిడదవోలు మున్సిపల్ ఛైర్ పర్సన్ కూటమి అభ్యర్థి మురాల జ్యోతి, వైస్ ఛైర్మన్ కొమ్మిన వెంకటేశ్వరరావుతో పాటు 32 వార్డుల్లో పోటీలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులందరినీ భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా 22వ వార్డులోని స్థానిక మసీదు వద్ద నమాజ్ పూర్తి చేసుకుని వస్తున్న ముస్లిం సోదరులను మంత్రి దుర్గేష్ కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి ముస్లిం సోదరులు ఘనస్వాగతం పలికి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను సమర్పించారు. ప్రజా వినతులపై సానుకూలంగా స్పందించిన మంత్రి దుర్గేష్ వారి సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ..ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా స్లాటర్ హౌస్‌ను వేరే ప్రాంతానికి తరలించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపామని, ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే కొత్త స్లాటర్ హౌస్‌ను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. పేద ముస్లిం మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, అవసరమైన ప్రాంతాల్లో షాదీఖానాల నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపుతామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో గడిచిన రెండేళ్ల కాలంలో నిడదవోలు పట్టణంలో మౌలిక వసతుల కల్పన ముమ్మరంగా సాగిందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిడదవోలులోని వందలాది మంది పేద కుటుంబాలకు కోట్లాది రూపాయల ఆర్థిక లబ్ధి చేకూర్చామని గుర్తుచేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, స్థానిక సంస్థల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే నిధుల కొరత లేకుండా వార్డులన్నీ వేగంగా అభివృద్ధి చెందుతాయని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం మాటలతో కాకుండా, స్పష్టమైన ప్రణాళికతో ప్రతి వార్డులో డ్రైనేజీ, రహదారులు, తాగునీరు, వీధిదీపాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి - నిడదవోలును మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

